ప్రజా

# రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnol,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 01 సంచిక -291 పేజీలు - 08 వెల - 06/- గురువారం 23 జనవరి 2025


## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

మంత్రాలయం వేదపాఠశాల విద్యార్థులు మృతి

కర్ణాటకలోని హంపి క్షేత్రానికి వెళుతుండగా ఘటన



**కర్నూలు:మంత్రాలయం:జనవరి 22 ( రిపబ్లిక్ న్యూస్):**
కర్ణాటకలో బుధవారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కర్నూలు జిల్లా మంత్రాలయం వేదపాఠశాలకు చెందిన విద్యార్థులు కర్ణాటక వెళ్తుండగా.. సింధనూరు సమీపంలో వాహనం బోల్తా పడిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్ చనిపోయారు. ఈ ప్రమాదంలో మరికొందరు విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సింధనూరు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంత్రాలయం నుంచి వేదపాఠశాల విద్యార్థులు కర్నాటకలోని హంపి క్షేత్రంలో జరిగే ఆరాధన కార్యక్రమానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.మృతులు మంత్రాలయం, ధారవాడ, గంగావతి కి చెందిన వారిగా గుర్తించారు.మిగతాది 2లో...

## మైనారిటీల ఆర్థికాభివృద్ధికి రాయితీ రుణాలు


2లో

- రాష్ట్రంలో49218 మంది లబ్ధిదారులకు చేయూత
- 2024-2025 కు రూ.326 కోట్లు ఖర్చు
- రాష్ట్ర ప్రభుత్వ రాయితీ 50% రూ.152.50 కోట్లు
- బ్యాంకుల ద్వారా మిగతా 50% లబ్ధిదారులకు
- నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పనకు అదనంగా రూ. 21.07 కోట్లు
- మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు
- రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

## జనసేన పార్టీలో నయా జోష్


మిగతా 2లో

- పార్టీకి శాశ్వత చిహ్నం రావడంపై హర్షం
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా అవతరణ
- జనసేన పదేళ్ల ప్రస్థానంలో మరో మైలురాయి
- మార్చి నెలలో పిఠాపురంలో ప్లీనరీ నిర్వహణ

**అమరావతి:జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**

కేంద్ర ఎన్నికల సంఘం చెప్పిన శుభవార్తతో జన సైనికుల్లో నయా జోష్ నిండింది. తమ పార్టీకి గాజు గ్లాస్ గుర్తును రిజర్వ్ చేయడం.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జాబితాలో చేర్చడంతో జనసేన కార్యకర్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. పదేళ్ల సుధీర్ఘ ప్రయాణం.. పోరాటం తర్వాత జనసేన ఈ మైలురాయికి చేరింది. దీనిపై ఆ పార్టీ 'ఎక్స్' వేదికగా తన అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది. దశాబ్ద కాలం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పోరాటా నికి, గడచిన ఎన్నికల్లో సాధించిన చారిత్రక విజయంతో చరిత్ర సృష్టించిన జనసేన పార్టీని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా గాజు గ్లాస్ గుర్తును శాశ్వత చిహ్నంగా గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొంది. సమాజంలోమార్పు కోసం పవన్ కల్యాణ్ 2014లో పార్టీ స్థాపించారని గుర్తుచేసింది. నేడు నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ప్రతి జనసైనికుడికి, వీరమహిళకు, నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపింది.


3లో

## రాజధాని అమరావతికి హడ్కో రుణం

- రూ.11వేల కోట్లు విడుదల చేసిన సంస్థ
- ముంబై బోర్డు సమావేశంలో నిర్ణయం
- మున్సిపల్ మంత్రి నారాయణ వెల్లడి

## అప్పుడు ఐటి..ఇప్పుడు ఎఐ

- ఏఐ యూనివర్సిటీలో భాగస్వాములు కండి
- బిల్‌గేట్స్‌ను కోరిన సిఎం చంద్రబాబు
- ఎఐ ఆధారిత అభివృద్ధిపై ఇద్దరు చర్చలు

**దావోస్,జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**
గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా నిలపాలని ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు దావోస్ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ మాజీ సీఈవో బిల్‌గేట్స్‌తో చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని సీఎం కోరారు. ఏపీలో ఏర్పాటు చేయబోతున్న వరల్డ్ క్లాస్ ఏఐ యూనివర్సిటీ సలహామండలిలో భాగస్వాములు కావాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు మైక్రో సాఫ్ట్ పెట్టడంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయా యని చంద్రబాబు గుర్తు చేశారు. దక్షిణ భారత్‌లో గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా నిలపాలని లోకేశ్ కోరారు. శరవేగంగా



అభివృద్ధి చెందుతోన్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో ఏర్పాటు చేయబోతున్న వరల్డ్ క్లాస్ ఏఐ యూనివర్సిటీ సలహామండలిలో భాగస్వాములు కావాలని కోరారు. సీఈవో హెల్త్ ఇన్నొవేషన్, దయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఆఫ్రికా తరహాలో హెల్త్ డ్యాష్‌బోర్డ్‌ల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. బిల్‌గేట్స్ సలహాలు రాష్ట్ర ఐటీ అభివృద్ధికి దోహదపడతాయన్నారు.మిగతాది 2లో...

## తెలుగు రాష్ట్రాలకు న్యాయమూర్తులు

తెలంగాణకు నలుగురు..

ఎపికి ఇద్దరు కేటాయింపు


2లో

## ట్రంప్ చర్యలపై భారత్ నిశిత పరిశీలన

ఆచితూచి వ్యవహరిస్తున్న మోడీ సర్కార్


3లో



## తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చుతాం...

### మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం చేస్తాం: రేవంత్ రెడ్డి

- తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్న సీఎం
- డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తామన్న ముఖ్యమంత్రి
- హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి

తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేక రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ డ్రైపోర్టును సమీపంలోని మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తామన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరమ్, సీఐఐ, హీరో మోటో కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు.మిగతాది 2లో...

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.2023/87888



# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనపై మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ ఘటనలో చనిపోయినవారి మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ నిర్వహించిన తర్వాత స్వగ్రామాలకు తరలించనున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అప్పుడు ఐటి...ఇప్పుడు ఎఐ

(మొదటి పేజీ తరువాయి)

చాలాకాలం తర్వాత చంద్రబాబును కలవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా బిల్‌గేట్స్ అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బిల్‌గేట్స్‌తో భేటీపై సీఎం చంద్రబాబు ట్వీట్
చేశారు. '1995లో ఐటీ, 2025లో ఏఐ అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిను చాలా కాలం తర్వాత కలవడం ఆనందంగా ఉందని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తన సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతకుముందు బిల్స్ గేట్స్‌తో సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిల్స్ గేట్స్‌తో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమపై నమ్మకంతో మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని నెలకొల్పడం ద్వారా హైదరాబాద్ రూపురేఖలు మారి పోయిన విషయాన్ని ఈ సందర్భంగా బిల్ గేట్స్‌కు గుర్తు చేశారు. అలాగే దక్షిణ భారతదేశంలో బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ కార్యకలాపాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గేట్‌వేగా నిలపాలని కోరారు. ఇక శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలను అందించాలని బిల్స్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ౼ూష్ట్రంలోని ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎకో సిస్టమ్‌ను నడపడానికి ఆఫ్రికాలో హెల్త్ డ్యాష్ బోర్డ్‌ల తరహాలో సామాజిక వ్యవస్థాపకతలో ఫౌండేషన్ తరపున నైపుణ్య సహకారాన్ని సైతం అందించాలంటూ బిల్స్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు కోరారు. మీ సహకారంతో స్థానికంగా ఉత్పత్తులపై ప్రపంచ ఆవిష్కరణలను అమలు చేసేలా తమ ప్రభుత్వం పని చేస్తుందని బిల్ గేట్స్‌కు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.

# తెలంగాణకు తీరప్రాంతం లేని లోటును పూడ్చుతాం...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అందరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలన్నారు. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని కోరారు.ప్రజలు తక్కువ ఖర్చుతో వేగంగా ప్రయాణించాలనేది ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలను రద్దు చేశామన్నారు.
దేశంలో అత్యధిక ఎలక్ట్రానిక్ వాహనాల విక్రయాలు తెలంగాణలోనే జరుగుతున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుకూల వాహనాల కోసం జీహెచ్‌ఎంసీలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో కోటికి పైగా జనాభా ఉందని, 100 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు

# అయోధ్యలో వైభవంగా తొలి వార్షికోత్సవం

## భారీగా తరలివచ్చిన భక్తజనం

అయోధ్య,: అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ తొలి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం దేశం అంతటి నుంచి వేలాది మంది భక్తులు రామ్ మందిరాన్ని దర్శించుకున్నారు. అయోధ్యలో కొత్తగా నిర్మించిన ఆలయంలో రామ్ లల్లా విగ్రహానికి గతేడాది జనవరి 22న ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో ఆ మైలురాయి ఉత్సవం జరిగింది. గట్టి భద్రత ఏర్పాట్ల మధ్య శ్రీరాముని విగ్రహ దర్శనార్థం బుధవారం సాయంత్రం పొద్దుపోయేంత వరకు ఆలయానికి వస్తూనే ఉండగా, 'జై శ్రీరామ్' పవిత్ర నినాదం మిన్నంటిందని అధికారులు తెలియజేశారు. ఇంతకు ముందు ఈ నెల 11 నుంచి 13 వరకు శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వహించింది. ఆ సమయంలో కూడా లక్షలాది మంది భక్తులు శ్రీరాముని దర్శనార్థం అయోధ్యకు వచ్చారు. బుధవారం వేలాది మంది భక్తులు వచ్చారని అధికారులు తెలిపారు.

--------------

# తెలంగాణకు రూ.45,500 కోట్ల భారీ పెట్టుబడి

## ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ

## సన్ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులతో 7వేల మందికి ఉద్యోగాలు




హైదరాబాద్,: తెలంగాణలో భారీ పెట్టుబడులపై దావోస్‌లో మరో కీలక ఒప్పందం జరిగింది. రూ.45,500 కోట్ల పెట్టుబడులతో సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ చేసుకుంది. భారీ పంప్డ్ స్టోరేజీ పవర్, సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై ఒప్పందం జరిగింది. రాష్ట్రంలోని నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగు ప్రాంతాల్లో ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. సన్ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టులతో 7వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో మూడో రోజు తెలంగాణకు భారీగా పెట్టుబడులు వచ్చాయి. సన్ పెట్రో కెమికల్స్ సంస్థ తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. తెలంగాణలో రూ.45,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ఆ సంస్థ అంగీకరించింది. ఈ మేరకు దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్ సంస్థ ఎంవోయూ చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్తు, సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ ఒప్పందంతో దాదాపు రాష్ట్రంలోని 7,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇప్పటివరకు దావోస్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావడం గమనార్హం. రాష్ట్రానికి భారీ పెట్టుబడి రావడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ అధికారుల బృందం సంతోషం వ్యక్తం చేసింది. దావోస్‌లో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ బృందం వెళ్లిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ టీమ్ వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతున్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పించే రాయితీల గురించి కంపెనీలకు వివరిస్తున్నారు. ఇప్పటికే యూనీ లివర్, స్కైరూట్, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంస్థ వంటి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తాజాగా సన్ పెట్రో కమికల్స్ సంస్థ కూడా భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది.

# గీత కులాలకు మరో 335 మద్యం దుకాణాల కేటాయింపు

అమరావతి:జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024-26 మద్యం పాలసీలో భాగంగా గీత కులాలకు 335 మద్యం దుకాణాలను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.
ఈ కేటాయింపు సామాజిక న్యాయం, సమానత్వం, మరియు గీత కులాల సాధికారతను ప్రోత్సహించడంలో కీలకభూమిక పోషిస్తుంది.
గీత కులాలు ఆంధ్రప్రదేశ్‌లో తాటి తాగు సంప్రదాయ వృత్తిని కొనసాగించే సమూహాలు. వీరిని వివిధ ప్రాంతాల్లో యాట గౌడ్, ఎడిగ, గౌడ (గమల), కలాలీ, శ్రీసయన (సెగిడి), మరియు సెట్టిబలిజా అనే పేర్లతో పిలుస్తారు. ఈమేరకు విడుదల చేసిన నోటిఫికేషన్ లోప్రధాన అంశాలు

1. 10% అదనపు దుకాణాల కేటాయింపు: గీత కులాలకు 10% అదనపు మద్యం దుకాణాలను కేటాయించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం లక్ష్యం.
2. జనాభా ఆధారంగా పంపిణీ: 2016 స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా జిల్లా వారీగా గీత కులాల జనాభా



నిష్పత్తి ప్రకారం దుకాణాల కేటాయింపు జరుగుతుంది
3. షెడ్యూల్ ప్రాంతాలు: షెడ్యూల్ ప్రాంతాల్లో గీత కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు ఉండదు.
4. ఒక్క వ్యక్తికి ఒక లైసెన్స్: లాభాలు ఎక్కువ మందికి అందేలా, ఒక్క వ్యక్తికి ఒక లైసెన్స్ మాత్రమే ఇచ్చే విధానం అమలు చేస్తారు.
5. తగ్గించిన లైసెన్స్ ఫీజు: గీత కులాల దుకాణాల వార్షిక లైసెన్స్ ఫీజు సాధారణ దుకాణాల ఫీజుతో పోలిస్తే 50% తక్కువగా ఉంటుంది.

**దరఖాస్తు విధానం:**
దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, లేదా హైబ్రిడ్ విధానంలో స్వీకరిస్తారు. దరఖాస్తుదారులు తమ కుల ధృవీకరణ పత్రం మరియు స్వస్థల ధృవీకరణ పత్రం అందించాలి.
ఎంపిక ప్రక్రియ డ్రా విధానంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది.

**లైసెన్స్ కాలపరిమితి:**
ఈ దుకాణాల లైసెన్స్ గడువు 30 సెప్టెంబర్ 2026 వరకు మాత్రమే ఉంటుంది.
ఈ నిర్ణయం గీత కులాలకు ఆర్థిక స్వావలంబనను అందించడంలో కీలకంగా నిలుస్తుంది. లైసెన్సుల కేటాయింపులో పారదర్శకత, సమానత్వాన్ని పాటిస్తూ, గీత కులాల సాధికారతకు బాటలు వేస్తుంది. తాజా నోటిఫికేషన్ తో గీత కులాలు సామాజికంగా, ఆర్థికంగా ముందుకు దూసుకెళ్లేందుకు సహకారం అందుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, నిషేధం మరియు ఎక్సైజ్ శాఖ ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తుంది

# మైనారిటీల ఆర్థికాభివృద్ధికి రాయితీ రుణాలు

అమరావతి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్) :
రాష్ట్రంలోని మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, మైనార్టీల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి అర్హత కలిగిన మైనార్టీలకు స్వయం ఉపాధి,నైపుణ్య, ఉపాధి కల్పన కోసం రూ.326 కోట్లు ఖర్చు చేసేందుకు, క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మైనారిటీ సంక్షేమ శాఖ చర్యలు చేపట్టిందని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. మైనార్టీలకు రాయితీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం తరఫున రూ.152.50 కోట్లు, వెచ్చింపుకు పాలనాపరమైన అనుమతులను జారీ చేస్తూ జీవో విడుదల చేసిందని తెలిపారు. మరో 50% రూ.152.50 కోట్లు రుణ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పనకు అదనంగా రూ. 21.07 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీ రుణాలను 19,790 మందికి, నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన ద్వారా 29,428 మందికి మొత్తం లబ్ధిదారులు 49,218 మంది ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూతను ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు.

**కేటగిరీల వారీగా రాయితీ రుణాల మంజూరు**

మైనార్టీల సంక్షేమ, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వార్షిక రాయితీ రుణ మంజూరు ప్రణాళికలో కేటగిరీల వారీగా రుణాలను మంజూరు చేయబోతున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. స్వయం ఉపాధి కింద 19790 మంది లబ్ధిదారులకు వారు ఏర్పాటు చేసుకునే యూనిట్ల వారిగా మూడు విభాగాలుగా గుర్తించి రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో 15000 మంది లబ్ధిదారులకు రూ.లక్ష లోపు రుణం, 3040 మంది లబ్ధిదారులకు రూ. 1 లక్ష నుండి రూ. 3 లక్షల వరకు,1525 మంది లబ్ధిదారులకు రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు,225 మంది లబ్ధిదారులకు రూ. 8 లక్షలు ప్రకారం రుణం అందించనున్నట్లు తెలిపారు.లిప్రతి స్కీమ్ లో కనీసం 40% మహిళలకు చోటు కల్పిస్తారు. రూ. లక్ష లోపు రుణాలు మంజూరులో కిరాణా, పాన్, చికెన్, మటన్, పండ్లు, కూరగాయలు స్టాల్స్ ఏర్పాటు, ఎలక్ట్రికల్ రిపేరీ, సైకిల్ షాప్ లో తదితర యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు ఇస్తారు.రూ. 1 లక్ష నుండి రూ. 3 లక్షల లోపు ఏసి, ఫ్రిడ్జ్ రిపేరీ, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్, బ్యాటరీ సర్వీసింగ్, సెల్ ఫోన్ రిపేరీ, మటన్,చికెన్ షాప్ లు, చెప్పుల షాపులు, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తారు.రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు ఆటోమొబైల్ సెక్టార్, ట్రాన్స్ పోర్టు సెక్టార్, ఫ్యాబ్రికేషన్ సెక్టార్ తదితర యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగాలనుకునే వారికి మండల కేంద్రాలు, పురపాలక, నగరపాలక కేంద్రాలలో ఉన్నవారికి జనరిక్ మందుల దుకాణాలు, ఆటోమొబైల్ యూనిట్లు, ఫిట్ నెస్ సెంటర్లు తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకున్నందుకు రూ. 8 లక్షలు రాయితీ రుణం మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మైనారిటీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా25,000 మందికి, మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి కింద టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వాటిల్లో 3,428 మందికి, మైనార్టీ ఎంపవర్మెంట్ కింద ఆటోమొబైల్ సెక్టార్, ఈవెంట్ మేనేజ్మెంట్, ఫిజియోథెరపీ తదితర వాటిల్లో 1000 మంది మైనార్టీలకు,మొత్తం 29,428 మందికి శిక్షణ ఇవ్వబోతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి అప్పటి పాలకులు తూట్లు పొడిచారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలోనే అన్ని రంగాలలో పూర్తిగా భ్రష్టు పట్టి పోయిన రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు చేస్తున్న కృషితో అప్పటి సమస్యల పరిష్కారం వేగవంతంగా కొలిక్కి వస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం బడ్జెట్లో కేటాయింపులకు అనుగుణంగా వార్షిక ప్రణాళిక ప్రకారం నిధుల మంజూరు, తదుపరి అభివృద్ధి చర్యలు, ఆర్థిక చేయూతకు రాయితీ రుణాలు, మైనార్టీల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# జనసేన పార్టీలో నయా జోష్

అమరావతి:జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)
ఏపీలో టీడీపీ వైసీపీ బలమైన ప్రాంతీయ పార్టీలుగా ఉన్న నేపథ్యంలో మూడవ పార్టీకి స్పేస్ ఏదీ అన్న చర్చ ఉంటూనే ఉంది. అయితే పవన్ కళ్యాణ్ జనసేనను స్థాపించిన తరువాత దశాబ్ద కాలంలో రచించిన వ్యూహాల కారణంగా జనసేన మూడవ పార్టీగా ఏపీ పాలిటిక్స్ లో ఎమర్జ్ కాగలిగింది. జనసేన 2014లో పోటీ చేయలేదు, 2019లో పోటీ చేసినా కూడా అధినేత పవన్ రెండు సీట్లలో ఓటమి పాలు అయ్యారు. పార్టీకి ఒకే సీటు దక్కింది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏడు శాతం కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. ఫలితంగా జనసేన 2019లో సాధించిన తాత్కాలిక గుర్తు గాజు గ్లాస్ అయితే అలా దక్కునా మానునా అన్న సందేహాలతోనే అయిదేళ్ల కాలం గడచింది. అయితే జనసేన 2024 ఎన్నికల్లో అనేక వ్యూహాలతో ముందుకు సాగింది. ఎందరు ఏ విధంగా మాట్లాడినా లేక రెచ్చగొట్టినా కూడా విడిగా పోటీ చేయలేదు. టీడీపీతో పొత్తు పెట్టుకుని బీజేపీ జట్టుని విడవకుండా కూటమిలో చేర్చి తాను లాభపడి ఆయా పార్టీలకూ రాజకీయ లాభం చేకూర్చింది. దాని ఫలితంగానే పోటీ చేసిన 21 సీట్లనూ జనసేన గెలుచుకుంది. అంతే కాదు ఏకంగా 8 శాతం ఓటు షేర్ ని సాధించింది. దాంతో జనసేనకు కేంద్ర ఎన్నికల సంఘం గుడ్ న్యూస్ వినిపించింది. ఆ పార్టీకి గాజు గ్లాస్ గుర్తుని శాశ్వతం చేస్తూ ఏపీలో జనసేనను రిజిష్టర్ పార్టీగా గుర్తిస్తూ కీలక నిర్ణయం ప్రకటించింది. దీంతో జనసేన కూడా ఏపీలో టీడీపీ వైసీపీలతో సరిసమానంగా రాజకీయం చేసేందుకు జనమెరిగిన గుర్తు గాజు గ్లాస్ తో దూకుడు చేసేందుకు మంచి ఆస్కారాన్ని ఈసీ కల్పించినట్లు అయింది. ఇక మార్చి 14న జనసేన ఆవిర్భావ సభలు పిఠాపురం వేదికగా జరగబోతున్నాయి. ఈ సభలలో పదేళ్ళ పార్టీ రాజకీయ ప్రస్థానం ముగించుకుని పదకొండో ఏట అడుగుపెడుతున్న నేపథ్యాన్ని పూర్తిగా గుర్తు చేసుకుంటారు. సమీక్షించుకుంటారు. అధికారంలోకి జనసేన వచ్చిన తరువాత తొలిసారి జరుగుతునన్ పార్టీ ప్లీనరీ అన్నది ఇప్పటిదాకా ఉన్న ఉత్సాహం అయితే ఇపుడు మరో కొత్త హుషార్ ఆ పార్టీకి దక్కుతోంది అదేంటి అంటే జనసేనకు శాశ్వతంగా పార్టీ గుర్తు. ఇది నిజంగా జనసేన సాధించిన అపూర్వ విజయంగా భావిస్తున్నారు. జనసేన గాజు గ్లాస్ జనాలలో ఉంది. అయితే ఇంతకలం ఫ్రీ సింబల్ కావడం వల్ల జనసేనకు ఇబ్బంది ఏర్పడింది. ఇక మీదట జనసేన సొంత గుర్తుతో పోటీకి దిగవచ్చు. పొత్తులు అన్నవి ఉన్నా లేకున్నా కూడా ఆ పార్టీ జెండా ఎగరవేయగలదు అన్న ధీమాను ఈ గుర్తు కలుగచేస్తోంది. ఏ రాజకీయ పార్టీకి అయినా ఊపిరి ప్రాణమూ గుర్తు మాత్రమే. అటువంటి గుర్తుని సాధించిన జనసేన చాలా ఆత్మ విశ్వాసాన్నే నింపుకుని ప్లీనరీ సభలకు ముస్తాబు కాబోతోంది. రానున్న రోజులలో జనసేన రాజకీయ దూకుడు ఏ విధంగా ఉంటుందో కూడా చూడాల్సిందే అని అంటున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు పలువురు న్యాయమూర్తులు

## తెలంగాణకు నలుగురు..ఎపికి ఇద్దరు కేటాయింపు

న్యూఢిల్లీజనవరి 22: (రిపబ్లిక్ న్యూస్):తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు పలువురు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులను బుధవారం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. అందులోభాగంగా తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ రేణుక ఎర్రా, జస్టిస్ నర్సింగరావు నందికొండ, జస్టిస్ తిరుమల దేవి ఎడ, జస్టిస్ మధుసూధనరావు బొబ్బిలి రామయ్యలను నియమించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు.. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావులను నియమించింది. తెలుగు రాష్ట్రాల



హైకోర్టులకు పలువురు న్యాయమూర్తులను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైంది. అందుకు పలువురు న్యాయమూర్తుల పేర్లను కేంద్రానికి సిఫార్స్ చేసింది. వీరి నియమాకానికి సంబంధించి.. ఈ రోజు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 28 మంది న్యాయమూర్తులే ఉన్నారు. ప్రస్తుతం కొలీజియం సిఫారసు చేసిన ఇద్దరూ వస్తే ఆ సంఖ్య 30కి చేరుతుంది. మరో ఏడుగురు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే తెలంగాణ హైకోర్టులో పలు ఖాళీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నలుగురు న్యాయమూర్తుల పేర్లను సిఫార్స్ చేశారు. వీరు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు.

------------------------

# కేరళలో భారీగా స్పిరిట్ స్వాధీనం

## ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరువనంతపురం,జనవరి22: కేరళ మలప్పురంలోని కోలప్పురంలో భారీగా స్పిరిట్ పట్టుకున్నారు. 20,000 లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పాలక్కాడ్ జిల్లా పోలీసు చీఫ్ డ్యాన్స్ స్క్వాడ్, తిరురంగడి పోలీసులు సంయుక్తంగా స్పిరిట్‌ను అరెస్టు చేసినట్లు సమాచారం. కర్ణాటక నుండి ఎర్నాకుళం వరకు స్పిరిట్‌ను అదుపులోకి తీసుకున్నారు. పాలక్కాడ్ నుండి ఒక పోలీసు బృందం లారీని వెంబడించి, స్పిరిట్‌ను కోలప్పురం వద్ద స్వాధీనం చేసుకున్నారు. స్పిరిట్‌ను డబ్బాల్లో తరలిస్తున్నారు. స్పిరిట్ పై చెత్త సంచులు, టార్పాలిన్‌తో కప్పబడి ఉంది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులోని మీనాక్షిపురంకు చెందిన మోయితీన్, పొల్లాచ్చికి చెందిన అన్నళకన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

--------

# ఆర్జీకర్ కేసులో అందరి వాదనలు వింటాం

## బెంగాల్ సర్కార్ పిటిషన్‌పై సిల్డా కోర్టు వెల్లడి

## కేసును సోమవారానికి వాయిదా



కోల్‌కతా,జనవరి22:ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో.. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్ రాయ్, సీబీఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది.కాగా, ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని.. ఇందులో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సియాల్దా కోర్టు నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.

-------

# యూజర్లకు ఎయిర్‌టెల్ షాక్

## రీఛార్జ్ ప్లాన్‌ల నుంచి డేటా తొలగింపు




న్యూఢిల్లీ,:**జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ యూజర్లకు షాకిచ్చింది. ఇప్పటికే అందిస్తున్న రెండు రీఛార్జి ఎ÷–లాన్లపై ఇచ్చే డేటాను తొలగించింది. వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా రీఛార్జి ప్లాన్లు తీసుకురావాలని టెలికాం కంపెనీలకు ట్రాయ్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌టెల్ రూ.509 ఎ÷–లాన్ 84 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఈ రీఛార్జితో అన్‌లిమిటెడ్ వాయిస్‌కాల్స్, 900 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఇక రూ.1,999 రీఛార్జి ప్లాన్‌తో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3600 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఈ రెండు రీఛార్జి ప్లాన్లపై ఇంతకు ముందు డేటా కూడా అందించేది. తాజాగా ఆ సదుపాయాన్ని తొలగించింది. త్వరలోనే జియో కూడా అదే బాటలో పయనించే అవకాశం ఉందని తెలుస్తోంది. అది అందిస్తున్న రూ.479, రూ.1999 ఎ÷–లాన్లపై డేటా తొలగించే అవకాశం ఉందని ఓ టిప్‌స్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దాదాపు అన్ని టెలికాం కంపెనీలు వాయిస్, ఎస్సెమ్మెస్‌తో పాటు డేటా కలగలిపిన ఎ÷–లాన్‌లు అందిస్తున్నాయి. ఇంటర్నెట్ అవసరం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో రీఛార్జి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా రీఛార్జి ఎ÷–లాన్లు తీసుకురావాలని ఆయా కంపెనీలను టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) తాజాగా ఆదేశించింది. స్పెషల్ టారిఫ్ వోచర్లు తీసుకురావాలంటూ సూచించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌టెల్ తన రెండు రీఛార్జి ఎ÷–లాన్లలో డేటాను తొలగించింది. త్వరలో జియో కూడా ఇదే బాటలో పయనించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

-----

# కాళేశ్వరంపై కొనసాగిన విచారణ

## హాజరైన జలవనరుల అభివృద్ధి మాజీ చైర్మన్ ప్రకాశ్



హైదరాబాద్, అమరావతి:**జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**కాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. దీనిలో భాగంగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్‌ను కమిషన్ ప్రశ్నించింది. కమిషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అఫిడవిట్ సమర్పించినట్లు వి.ప్రకాశ్ తెలిపారు. ఎవరి మద్దతూ అవసరం లేదని కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ఆయనకు బదులిచ్చారు. రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా పని చేస్తామని చెప్పారు. తమ ముందు ఎవరూ రాజకీయ ఉపన్యాసాలు చేయవద్దన్నారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు ప్రకాశ్ తెలిపారు. స్థిరీకరణకూ ఎక్కువ నీరు అవసరం కాబట్టి చేపట్టారన్నారు. మేడిగడ్డ వద్ద ఆనకట్ట వద్దని ఇంజినీర్ల కమిటీ చెప్పింది కదా అని కమిషన్ ప్రశ్నించింది. విశ్రాంత ఇంజినీర్ల కమిటీ అలా చెప్పలేదని ప్రకాశ్ పేర్కొన్నారు. బొగ్గు గనుల వద్ద సొరంగాలు వద్దన్న సిఫారసును ప్రభుత్వం గౌరవించిందని చెప్పారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకునే కాళేశ్వరం నిర్మించారన్నారు.

# రాజధాని అమరావతికి హడ్కో రుణం

## రూ.11వేల కోట్లు విడుదల చేసిన సంస్థ

## ముంబై బోర్డు సమావేశంలో నిర్ణయం

## మున్సిపల్ మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి,జనవరి22: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాజధాని నిర్మాణానికి రూ.11 వేల కోట్లు విడుదల చేయాలని హడ్కో నిర్ణయించింది. ఈ మేరకు ముంబైలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి హడ్కో ద్వారా రూ.11 వేల కోట్ల రుణం కోసం తమ ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందని ఆయన గుర్తు చేశారు. ఈ సంప్రదింపులతో హడ్కో సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ హడ్కో నిర్ణయంతో రాజధాని అమరావతి పనులు వేగవంతమవుతాయని ఆయన స్పష్టం చేశారు. తేడాది మే, జూన్ మాసంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఆంధ్రప్రదేశ్ ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో గత ఐదేళ్లుగా.. అంటే 2019 నుంచి 2024 మే మాసం వరకు వైసీపీ పాలనలో రాష్ట్ర రాజధాని ఏదో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. అలాంటి వేళ.. 2024 ఎన్నికల్లో రాష్ట్ర ఓటర్లు స్పష్టమైన తీర్పు ఇవ్వడంతో.. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అంతేకాదు.. రాజధాని అమరావతితోపాటు రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తాము సైతం సహాయ సహకారాలు అందిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అగ్రనేతలు, ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సైతం ప్రకటించిన విషయం విధితమే. క కేంద్రంలో ఎన్డీయే సర్కార్, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో.. ఆంధప్రదేశ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కేంద్ర బ్జడెట్‌లో సైతం అమరావతి నిర్మాణానికి నిధులు సైతం కేటాయిస్తోంది. ఇక దేశీ, విదేశీ సంస్థలు సైతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు ఆయన కేబినెట్ సహచరులు దావోస్‌లో పర్యటిస్తున్నారు.ఇంకోవైపు గత ఐదేళ్లలో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు జరగలేదు. సరికద.. ఉన్న పరిశ్రమ అమర రాజా సైతం పక్క రాష్ట్రానికి తరలిపోయింది. అలాగే లూలు సంస్థ సైతం గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. కానీ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తిరిన అనంతరం విశాఖ, తిరుపతి, విజయవాడలల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ సానుకూలంగా స్పందించింది. అలాంటి వేళ.. రాజధాని నిర్మాణానికి హుడ్కో నిధులు కేటాయించడం వల్ల.. ఆ ప్రాంతం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతోందని అక్కడి వాసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సిఎంలు

## చంద్రబాబు, రేవంత్, ఫడ్ణవీస్‌ల కలయిక

దావోస్,అమరావతి:**జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)** దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఏఐ, రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ లో మూడో రోజు పర్యటిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో బుధవారం వివిధ రంగాల పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. అలాగే యునీలీవర్, డీపీ వరల్డ్ గ్రూపు, పెట్రోలియం నేషనల్ బెర్హాద్ (పెట్రోనాస్), గూగుల్ క్లౌడ్, పెప్సీకో, ఆస్ట్రా జెనెకా సంస్థల అధిపతులు, బిల్ గేట్స్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధితోనూ సీఎం చంద్రబాబు చర్చలు జరపనున్నారు. తర్వాత దావోస్ సమావేశాల్లో గ్రీన్‌కోతో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. ప్రకృతి వ్యవసాయం, హ్యూమన్ మిషన్ కొలాబ్రేషన్, గ్రీన్ హైడ్రోజన్ ? పునరుత్పాదక విద్యుత్ వంటి అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలకు చంద్రబాబు హాజరవుతారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు వున్న అవకాశాలను వారికి ముఖ్యమంత్రి వివరించనున్నారు.




# ట్రంప్ చర్యలపై భారత్ నిశిత పరిశీలన

## ఆచితూచి వ్యవహరిస్తున్న మోడీ సర్కార్

**జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్‌లో నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన అక్రమ వలసదారులపై కఠిన వైఖరిని అవలంబిస్తున్నారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అధిక పన్ను విధిస్తున్నారు. తద్వారా వలసలను తగ్గించొచ్చని అధ్యక్షుడు భావిస్తున్నారు. నేపథ్యంలో ట్రంప్ చర్యలతో భారత్ ఆచుతూచి నిర్ణయాలు తీసుకుంటోంది. అగ్రరాజ్యంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తోన్న దౌత్య, ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించింది. వాటిపై ఎలాంటి దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడుతోంది. ట్రంప్ పాలనకు సహకరించేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న తమ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత్ యోచిస్తున్నట్లు సమాచారం. సరైన పత్రాలు లేకుండా దాదాపు 18,000 మంది భారతీయులు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. అయితే, వాస్తవానికి ఆ సంఖ్య మరింత ఎక్కువ కూడా ఉండొచ్చని అంచనా.



తాజాగా కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వాళ్లందరినీ వెనక్కి పిలిపించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. దీనికోసం ఓ సమగ్ర ప్రణాళికను రూపొందించబోతోందని పేర్కొన్నారు.
కాగా, ఎన్నికల ప్రచారంలో అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులను ర్యాడికల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించారు. అలాంటి వాళ్లు అమెరికా గడ్డపై నివసించేందుకు ఏమాత్రం అర్హులు కాదని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జన్మతః పౌరసత్వ హక్కును కూడా రద్దు చేశారు. అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. ఇక ట్రంప్ చర్యల నేపథ్యంలో అప్రమత్తమైన భారత ప్రభుత్వం భారతీయులను తిరిగి వెనక్కి రప్పించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

--------------------

# ఆకాశంలో అద్భుతం

## ఒకే వరుసలోకి ఆరు గ్రహాలు




న్యూఢిల్లీ,:**జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)** ఆకాశంలో ఓ అద్భుతమైన ఖగోల దృశ్యం ఆవిష్కృతమైంది. సౌర వ్యవస్థలోని ఆరు గ్రహాలు అంగారక, బృహస్పతి, యూరేనస్, నెప్ట్యూన్, శుక్రుడు, శని గ్రహాలు ఒకే సరళరేఖపైకి వచ్చాయి. ఇది ఓ అందమైన ప్లానెట్ పరేడ్‌గా కన్పించింది. ఈ ప్లానెట్ పరేడ్‌లో ఒకే వరుసలోకి వచ్చిన శని, బృహస్పతి, అంగారక, శుక్రుడు గ్రహాలు ఎలాంటి ప్రత్యేక పరికరాలను ఉపయోగించకుండానే మన కళ్లతో స్పష్టంగా కనిపించాయి. అయితే నెప్ట్యూన్, యురేనస్ గ్రహాలను చూసేందుకు మాత్రం టెలిస్కోప్ ద్వారానే సాధ్యమైంది. ఇది జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే జరిగే అద్భుతం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనిని 'పరేడ్ ఆఫ్ ప్లానెట్స్', 'గ్రహాల కవాతు'గా పిలుస్తున్నారు. ఈ ఖగోళ దృశ్యం మంగళవారం రాత్రి ఆవిష్కృతమైంది. సూర్యాస్తమయం అయిన 45 నిమిషాల తర్వాత ఈ అద్భుతం కనిపించింది. ఈ కలయిక దాదాపు మూడు గంటల పాటు కొనసాగింది. కొన్ని వారాల పాటు ఈ అరుదైన గ్రహాల అమరిక కనిపించనుంది. రోజూ చీకటి పడిన తర్వాత నైరుతి దిక్కున శుక్రుడు, శని గ్రహాలను రెండు గంటల పాటు చూడొచ్చని, బృహస్పతి ప్రకాశవంతంగా ప్రకాశిస్తుంది, తూర్పున అంగారక గ్రహం కనిపిస్తుందని నాసా తెలిపింది. భారత్‌లో ప్రతి నగరం నుంచి ఈ గ్రహాల కవాతును చూసే అవకాశం ఉంటుంది. ఇలాంటి దృశ్యం ఫిబ్రవరి 28వ తేదీన మరోసారి సాక్షాత్కారం కానుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆకాశంలో ఆరు నుంచి ఏడు గ్రహాలు ఒకే వరుసలో రావడం చాలా అరుదుగా జరిగే సంఘటన.

# గ్రాహం స్టెయిన్స్ కోసం ప్రత్యేక ప్రార్థనలు..



**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రముఖ క్రైస్తవ మిషనరీ సువార్తికుడు గ్రాహం స్టెయిన్స్ అతని కుమారులు ఫిలిప్, తిమోతిలను కొందరు మతోన్మాదులు సజీవ దహనం చేయడం భాధకరమని జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ జీ. రవికుమార్ తెలిపారు. గ్రాహం స్టెయిన్స్ సజీవదహనం కాబడి నేటికి 26 సంవత్సరాలు పూర్తి అయినవని... 1999వ సంవత్సరం జనవరి 22న మతోన్మాదులు గ్రాహం స్టెయిన్స్ వాహనాన్ని నిప్పు పెట్టి సజీవ దహనం చేశారన్నారు. గ్రాహం స్టెయిన్స్ కోరకు కోల్స్ చర్చ్ లో జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు చేశామని రవికుమార్ తెలిపారు. ఈసందర్భంగా గ్రాహం స్టెయిన్స్ సేవాకార్యాక్రమాలను రవికుమార్ వివరించారు. గ్రాహం స్టెయిన్స్ ఒడిశా లోని గిరిజనులను చెడు మార్గం నుంచి మంచిమార్గంలో నడిపించారన్నారు. గిరిజనులు ఏసుక్రీస్తును రక్షకుడిగా అంగీకరించి మంచి జీవితాన్ని జీవించడాన్ని సహించలేని కొందరు మతోన్మాదులు గ్రాహం స్టెయిన్స్ ను సజీవ దహనం చేశారని రవికుమార్ పేర్కొన్నారు. ఇంతదారుణం జరిగిన గ్రాహం స్టెయిన్స్ భార్య గ్లాడీస్ ఎలాంటి పోలీసు కేసు పెట్టలేదన్నారు.గ్రాహం స్టెయిన్స్ భార్య గ్లాడీస్ ఒడిశా రాష్ట్రంలో చేసిన సేవలకు ఒడిశా ప్రభుత్వం నుంచి 2016లో పద్మశ్రీ మథర్ థెరిస్సా మెమోరియల్ ఇంటర్నేషనల్ అవార్డును అందుకుందని రవికుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్,రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మేగా జాబ్ మేళ




కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)
25-01-2025, శనివారం9:00 am దేవి ఫంక్షన్ హాల్, నంద్యాల చెక్ పోస్ట్ దగ్గర, కర్నూల్.
సుప్రసిద్ధ అమర రాజా కంపెనీ గ్రోత్ కారిడార్ లో 400 ఆపరేటర్లు మరియు అప్రెంటీస్ షిప్ ట్రైనీ ఉద్యోగాల నిమిత్తం ఇంటర్వ్యూల నిర్వహణ. కనీస విద్యార్హతలు : టెన్త్, ఇంటర్, ఐటీఐ వయో పరిమితి : 16 నుంచి 30 సంవత్సరాల వరకుస్టైఫండ్:12,000-15,000/- భోజనం వసతి మరియు జాబ్ పర్మినెంట్కు భరోసా ట్రైనింగ్ పీరియడ్ పూర్తి అయిన అనంతరం నెలకు రూ.22,000/- వేతనంలొకేషన్:అమర రాజా గ్రోత్ కారిడార్, నూనెగుండ్లపల్లి గ్రామం, బంగారుపాలెం మండలం, చిత్తూరు జిల్లా.జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ల కోసం,,8978913164, 9505370706 నంబర్లకు సంప్రదించగలరు

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకం కలిసిన హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు



కర్నూ లు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు కలెక్టర్ కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ గౌ శ్రీ రంజిత్ భాష ఐఏఎస్ గారిని ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా హెచ్ఆర్పిసిఐ సంస్థ నేషనల్ చైర్మన్ ఆర్ కె .కంబగిరి స్వామి గారు మరియు హ్యూమన్ రైట్స్ ఎడ్యుకేషనల్ సెల్ రాష్ట్ర చైర్మన్ రమణయ్య గారు జిల్లా ఎడ్యుకేషనల్ పబ్లిక్ రిలేషన్ సెల్ చైర్మన్ అయ్యన్న అనంతరం జిల్లా కలెక్టర్ హెచ్ఆర్పిసిఐ సంస్థ విధుల గురించి సంస్థ చేసే కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ వాలంటరీస్ నెంబర్స్ పాల్గొన్నారు.

# కర్నూలు రేంజ్ డీఐజీ గారిని మర్యాదపూర్వకం కలిసిన హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు



**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు రేంజ్ డీఐజీ బంగ్లా నందు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకం కలిసిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా హెచ్ఆర్పిసిఐ సంస్థ నేషనల్ చైర్మన్ ఆర్ కె .కంబగిరి స్వామి గారు మరియు హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఎడ్యుకేషనల్ చైర్మన్ రమణయ్య జిల్లా హ్యూమన్ రైట్స్ ఎడ్యుకేషనల్ %ం% పబ్లిక్ రిలేషన్ సెల్ చైర్మన్ అయ్యన్న అనంతరం డిఐజి మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ సంస్థ విధుల గురించి సంస్థ చేసే కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా పాల్గొన్నవారు హ్యూమన్ రైట్స్ వాలంటరీస్ మెంబర్స్ పాల్గొన్నారు.

# ఏపీ మాజీ మంత్రిపై కేసు నమోదు

**అమరావతి,జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)** ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదైంది. కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కావలి వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు రావడంతో కాకాణిపై కేసు నమోదు చేశారు. కొన్ని రోజుల కిందట బోగోలు మండలం కోళ్లదిన్నెలో మాజీ మంత్రి కాకాణి అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రసన్న ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహానంది 1,400 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం

మహానంది, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):
గాజులపల్లె సమీపంలోని బుచ్చమ్మ తోట సమీపంలో నాటుసారా బట్టీ నిర్వహిస్తున్న సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించి 1,400 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అబ్బీపురం, బొల్లవరం గ్రామాల్లో షాపులు నిర్వహిస్తున్న వారిపై దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం: డా. కె.వి.సుబ్బారెడ్డి

### శ్రామికులందరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి :అడిషనల్ కమాండెంట్ మహబూబ్ బాషా





**కర్నూలు ప్రతినిధి జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)**
ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలందరూ ఆరోగ్యవంతంగా ఉంటే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని ప్రముఖ విద్యావేత్త ,కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కె.వి.సుబ్బారెడ్డి అన్నారు. కష్టపడి పనిచేసే శ్రామికులందరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని ఏపీ ఎస్పీ ఇన్చార్జి కమాండెంట్ మహబూబ్ బాషా కోరారు. బుధవారం కర్నూలు ఆటోనగర్ లో రాయలసీమ ఆటోమొబైల్స్ ఆధ్వర్యంలో అమీలియో హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారిరువురు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. విద్యావేత్త డాక్టర్ కేవీ. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యానికి మించిన ఐశ్వరం లేదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కుటుంబం కోసం నిత్యం కష్టపడే కార్మికులు, శ్రామికులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ,ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని అడిషనల్ కమాండెంట్ మహబూబ్ బాషా కోరారు. పనిచేసే కార్మికులు ఆరోగ్యవంతంగా ఉంటేనే వారి కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. సీనియర్ జర్నలిస్టులు టీ. విజయ్ , అబ్దుల్ సత్తార్ పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ ప్రెసిడెంట్ ఎస్.ఎం .ఖాద్రి సాహెబ్, అమీలియో హాస్పిటల్ వైద్య సిబ్బంది డాక్టర్ ప్రసన్న, డాక్టర్ రమాదేవి, మేనేజర్ వరప్రసాద్ లతోపాటు 2డి ఎకో టెక్నీషియన్ కళ్యాణి తదితర టెక్నికల్ సిబ్బంది, పలువురు మెకానిక్ లు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత 36 వ మాసోత్సవాలు

# రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన





కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)
కర్నూల్ నగరంలోని బళ్లారి చౌరస్తా లో జాతీయ రోడ్డు భద్రత 36 వ మాసోత్సవాలు డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎస్ శాంతకుమారి ఆదేశాల మేరకు. ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ల ఆధ్వర్యంలో బుధవారం బళ్లారి చౌరస్తాలో మ్యాక్సీ క్యాబ్ మరియు మోటార్ క్యాబ్ డ్రైవర్లకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీట్ బెల్ట్ ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్లోడ్ ప్రయాణికులు, వాహనాల నిర్వహణ, ఓవర్ స్పీడ్, ప్రయాణికుల పట్ల మర్యాదపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కె రవీంద్ర కుమార్, ఎస్ నాగరాజా నాయక్, ఎం వి సుధాకర్ రెడ్డి, మాట్లాడుతూ జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రహదారి భద్రతలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు మోటార్ సైకిల్ నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనాదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ను ధరించాలి, వాహనాదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు, ముఖ్యంగా వాహనాదారులు సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమన్నారు, అధిక వేగం రాష్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమన్నారు, అదేవిధంగా ఆటో రిక్షా లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు. వాహనదారులకు రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కే రవీంద్ర కుమార్, ఎస్ నాగరాజ నాయక్, ఎం వి సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు వి బాబు కిషోర్ ఎన్ గణేష్ బాబు, డాక్టర్ జెశన్ అహ్మద్, ట్రాన్స్పోర్ట్ హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, వి విజయభాస్కర్, హోంగార్డులు, వాహనదారులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# రూ.291.67 కోట్లతో నగరపాలక అంచనా బడ్జెట్

### స్థాయి సంఘ సమావేశంలో ఆమోదం





కర్నూలు ప్రతినిధి జనవరి22(రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు నగరపాలక సంస్థ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనాల బడ్జెట్ను బుధవారం స్థాయి సంఘం ఆమోదించింది. నగరపాలక కార్యాలయంలో మేయర్ బి.వై. రామయ్య అధ్యక్షతన, స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. రూ.291.67 కోట్లతో బడ్జెట్ రూపకల్పన చేశారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు రూ.201.22 కోట్లు, రెవెన్యూ ఆదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. అదేవిధంగా రెండు తీర్మానాలకు స్థాయి సంఘం ఆమోదం తెలిపింది. అమృత్-2 పథకంలో భాగంగా 19వ వార్డులోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ పబ్లిక్ పార్కు, 45వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించి, ఏడాది కాలానికి సంబంధించి ఒక్కొక్క పార్కుకు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. 200 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 17 నుండి ఈ ఏడాది జనవరి 31 నాటికి సంబంధించి, రూ.42.93 లక్షల వేతనాలు చెల్లింపునకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, సభ్యులు జుబేర్, యూనూస్, క్రాంతి కుమార్, మిద్దె చిట్టమ్మ, అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చుండి ప్రసాద్, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, అకౌంట్స్ అధికారులు శబాన, మల్లికార్జున్, క్లర్క్ జి.ఎం. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలు విడుదల

### మే 3 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు




**అమరావతి:జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)** ఏపీలో గ్రూప్-1 ఉద్యోగాల నియామకం కోసం మెయిన్స్ పరీక్షల తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మే 3 నుంచి 9వ తేదీ వరకు ఎగ్జామ్స్ నిర్వహించనుంది. ప్రిలిమ్స్లో 4,496 మంది అభ్యర్థులు అర్హత సాధించగా వారిలో 1:50 చొప్పున అభ్యర్థులను మెయిన్స్కి ఎంపిక చేసింది. 2023 డిసెంబర్?లో అప్పటి వైసీపీ ప్రభుత్వం 89 గ్రూప్?-1 ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. 2024 మార్చి 17న ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ను నిర్వహించింది. వైసీపీ సర్కార్ ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రిలిమ్స్ నిర్వహించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, మెయిన్స్ పరీక్ష రాసేందుకు తగిన గడువును ఇవ్వాలని కమిషన్ను పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అమలాపురంలో మెయిన్స్ పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ పరీక్షలను డిస్క్రిప్టివ్ టైప్?లో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ఇన్చార్జి కార్యదర్శి ఐ . నరసింహామూర్తి తెలిపారు. మెయిన్స్ ప్రశ్నాపత్రాన్ని ట్యాబ్లలో పొందుపరచి ఇవ్వనున్నట్లు వెల్లడించారు

# తిరుమలలో శారదాపీఠం నిర్మాణాలు

### చట్ట విరుద్ధ నిర్మాణాలపై ధర్మాసనం ఆగ్రహం



అమరావతి:జనవరి 22: (రిపబ్లిక్ న్యూస్)అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను ఉపేక్షించడానికి వీల్లేదని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. తిరుమలలోని శారదాపీఠం భవన నిర్మాణం విషయంలో ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ భవనం కూల్చివేతకు ఆదేశాలు ఇస్తామని తెలిపింది. తిరుమలలో ప్లాన్కు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేపడతారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ప్రశ్నించింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిపితే ఏం జరుగుతుందో ఈ కేసు ఒక ఉదాహరణ కావాలని పేర్కొంది. విశాఖ శారదాపీఠం తిరుమలలో అక్రమ నిర్మాణాలను చేపడుతున్నప్పటికీ తితిదే ఎలాంటి చర్యలు తీసుకోలేదని తిరుమల క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు, న్యాయవాది తుమ్మా ఓంకార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. గతంలో ఈ పిటిషన్పై విచారణ జరిపిన హైకోర్టు.. భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశాలిచ్చింది. ఈ పిల్పై బుధవారం మరోసారి విచారణ జరిగింది. శారదాపీఠం భవనాన్ని సీజ్ చేస్తూ తితిదే బోర్డు తీర్మానం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. బిల్డింగ్ ఎ÷-లాన్ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు ఎలా చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలిస్తామని పేర్కొంది. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని శారదాపీఠం తరఫు న్యాయవాది అభ్యర్థించగా.. అందుకు అనుమతిస్తూ తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# దేశ ప్రజల మనోభావాలు దెబ్బ తీసిన అమిత్ షా

**-మంత్రి పదవికి రాజీనామా చేయాలి - కాంగ్రెస్ భారీ పాదయాత్ర -రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్**

కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్) కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుండి వెంటనే భర్తరఫ్ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి అంబటి రామకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా రామకృష్ణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్ గారిని జపించే బదులు, భగవంతుని జపిస్తే మోక్షం లభిస్తుందని అంబేద్కర్ గారిని అవమానపరిచారని అమిత్ షా గారి ఉద్దేశం భారత రాజ్యాంగాన్ని మార్చేయాలని ఉద్దేశంగా ఉందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళల హక్కులను కాలరాయాలను చూస్తున్నారని రాజ్యాంగాన్ని రచించిన భారత రాజ్యాంగ పితామహుడు అంబేద్కర్ గారిని అలాంటి మహనీయుని అవమానించిన అమీషా ప్రధాని నరేంద్ర మోడీ బర్తరఫ్ చేయకుండా ఇంతకాలం చూస్తూ ఊరుకుంటున్నారని అమిత్ షా గారి మాటలు అతని దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు. రాహుల్ గాంధీ సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని రామకృష్ణ తెలియజేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీ కృష్ణ గారు మాట్లాడుతూ హోమ్ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని లేకుంటే ప్రధాని మోదీ గారు మంత్రి పదవి నుండి అమీషా గారిని బర్తరఫ్ చేయాలని, కూటమి నాయకులు అధికారంలో ఉన్నారంటే ఎంపీ, ఎమ్మెల్యేలు, రాజ్యాంగం వల్లనే పదవులు వచ్చాయి తప్ప స్వతహాగా చేసింది ఏమీ లేదని అంబేద్కర్ అవమానిస్తే యావత్ దేశ ప్రజలను అవమానించినట్లేనని మీ మాటలు వెనక్కి తీసుకొని స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. అమిత్ షాచేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అతను వెంటనే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని కోరుచూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారి పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి షర్మిల రెడ్డి





ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పరిగెల మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్ర జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమై అమిత్ షా డౌన్ డౌన్, కాంగ్రెస్ పార్టీ జిందాబాద్, అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలి అని నినాదాలు చేస్తూ నెహ్రూ రోడ్, చౌక్ బజార్, గడియారం హాస్పిటల్, పెద్ద మార్కెట్ మీదుగా పాత బస్టాండు వద్దగల అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరము ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఎమ్మిగనూరు ఎం ఖాసిం వలి, ఆలూరు చిప్పగిరి లక్ష్మీనారాయణ, ఆదోని జి రమేష్ యాదవ్, పత్తికొండ బి క్రాంతి నాయుడు, మంత్రాలయం పి మురళీకృష్ణమరాజు జిల్లా ఓబీసీ చైర్మన్ డివి సాంబశివుడు ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు బి బతుకన్న, ఎన్ సుంకన్న, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల కాంగ్రెస్ నాయకులు ఎన్ సి బజారన్న ఎజాస్ అహ్మద్, బి సుబ్రహ్మణ్యం, ఈ లాజరస్, షేక్ ఖాజా హుస్సేన్, అనంతరత్నం మాదిగ వై మారుతి రావు రాఘవేంద్ర రెడ్డి రియాజుద్దీన్ షాహిద్ అహ్మద్, షేక్ అక్బర్, రమేష్, అమన్, డబ్ల్యు సత్తిరాజు నవీద్, అబ్దుల్ హై షేక్ మాలిక్ రవి తుగ్గలి రవి కుమార్, జాన్ సదానందం వసి బాషా, మిన్నెలా, వసీం మహిళా కాంగ్రెస్ పుష్ప మల్లేశ్వరి శ్రీలత అధిక సంఖ్యలో ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షులుగా డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి



### ఈనెల 25వ తేదీన గురు రాజా స్కూల్ మైదానంలో దివ్యాంగుల క్రీడా పోటీలు

**నంద్యాల జనవరి 22( రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం నంద్యాల పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో నంద్యాల పారా స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షులుగా శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. డాక్టర్ దస్తగిరి రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులుగా వ్యవహరించడానికి అంగీకరించినందుకు సంఘం కార్యవర్గం ధన్యవాదాలు తెలియ చేసింది. డాక్టర్ దస్తగిరి రెడ్డి దివ్యాంగుల క్రీడలు, సంక్షేమానికి తమ వంతు సహకారం ఇస్తామని తెలిపారు.
ఈనెల 25వ తేదీ శనివారం ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ మైదానంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, 100, 200,400 ,800, 1500 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, డిస్కస్, జావలిన్, త్రో బాల్ అంశాలలో శారీరక, మానసిక, కంటిచూపు, మరుగుజ్జు దివ్యాంగులకు వివిధ వైకల్య క్యాటగిరిలలో క్రీడలు నిర్వహించి , ఈనెల 30వ తేదీ గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో నంద్యాల తరఫున పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,ఎం.పీ.వి.రమణయ్య ప్రకటించారు. ఆసక్తిగల దివ్యాంగ క్రీడాకారులు శనివారం ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహించే స్థలానికి చేరుకోవాలని కోరారు.

## ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవాలి.

**ఏపీ డీజీపీ, ఏపీఎస్ఆర్టీసీ వి.సీ అండ్ ఎండి ద్వారక తిరుమల రావు.**








**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)** ఏపీఎస్ఆర్టీసీలో ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవాలని ఏపీ డీజీపీ ఏపీఎస్ఆర్టీసీ విసి అండ్ ఎండి ద్వారకా తిరుమలరావు అన్నారు. బుధవారం ఆయన కర్నూలు వన్ డిపో ను సందర్శించారు. ముందుగా ఆయనకు కర్నూల్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు పూల బోకే ఇచ్చి స్వాగతం పలికారు. ముందుగా వంటి ప్రాంగణంలో మామిడి మొక్కను నాటారు. తదుపరి డిపో గ్యారేజ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు బస్సుల ఆపరేషన్ ద్వారా కార్గో సేవల ద్వారా ఆదాయాన్ని పెంచుతూ వ్యయాన్ని తగ్గించాలన్నారు. సిబ్బందికి రావాల్సిన అలవెన్సులు ఆర్పిఎస్ 2017 కు సంబంధించిన బకాయిలను ఈనెల లోగా ఇచ్చేటట్లు చర్యలు తీసుకుంటానని తెలిపారు తాను చేరిన 44 నెలలో కోటి 10 లక్షలు సాధారణ మరణం పొందిన వారికి ఇచ్చామన్నారు. నైట్ డ్యూటీ అలవెన్స్ ఈహెచ్ఎస్ అలవెన్స్ లో పరిష్కరించామన్నారు కారుణ్య నియామకాల కింద 1600 మందినీ ఉద్యోగాల్లో నియమించామన్నారు. పీఎఫ్ లో 960 కోట్లు లోన్లు సాధించామని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులకు మంచి ప్రయాణ సౌకర్యాలు అందించి ఒక్కరోజులో 23 కోట్ల రూపాయలు ఆదాయం సాధించి రికార్డు సృష్టించామన్నారు. సిబ్బంది సంక్షేమం తాను చూసుకుంటానన్నారు తాను పదవీ విరమణ చేసేలోపు ముఖ్యమంత్రితో మాట్లాడి సిబ్బందికి రావాల్సిన బకాయిలన్నీ వచ్చేలాగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో డిజిపి తో పాటు కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్, కర్నూలు జిల్లా ప్రజారవాణా అధికారి టి శ్రీనివాసులు డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ వి హరిబాబు, 1,2 డిపోల మేనేజర్లు సిబ్బంది ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

**భక్తులకు చిన్న ఇబ్బందులు కూడ కలుగకూడదు -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





శ్రీశైలం/నంద్యాల, జనవరి 22:-
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి చిన్న ఇబ్బందులు కూడ తలెత్తకుండా శ్రీస్వామి అమ్మవార్లను సంతృప్తికరంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం దేవస్థాన అన్న ప్రసాద వితరణ భవన ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిర్వహణపై జిల్లాధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పి యుగంధర్ బాబు, శ్రీశైలం సబ్ డిఎఫ్ఓ మహమ్మద్ అన్వర్ ఆలీ, సబ్‌కలెక్టర్ సాదిక్ త్రివినాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఫిబ్రవరి 19 నుండి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు సమన్వయముతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు. శాఖల వారిగా సమీక్షిస్తూ, అవసరమైన ప్రతిపాదనలను సమర్పిస్తే దేవస్థానం కార్యనిర్వహణాధికారిని సమన్వయం చేసి సంబంధిత ఏర్పాట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు చేసే ఏర్పాట్లపై 200 శాతం పకడ్బంది ప్రణాళికలు రూపొందిస్తే 100 శాతం అమలులోకి వస్తాయన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, త్రాగునీరు, టాయిలెట్స్, పార్కింగ్, రవాణా, భక్తులకు శీఘ్రదర్శనం తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా వెంటనే స్పందించి ఏర్పాట్లలో నిమగ్నం కావాలన్నారు. లక్షల మంది పాదయాత్ర భక్తులు వచ్చే మార్గాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని మెడికల్ అధికారులను ఆదేశించారు.
భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాల్లో ప్రమాదానికి గురైన బాధితులకు స్ట్రేచ్చర్లు, అంబులెన్సులను కూడా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ డిఎంఅండ్ హెచ్ఓను ఆదేశించారు. క్యూలైన్లలో స్వామిఅమ్మవార్ల దర్శనార్థమై వేచివుండే భక్తులు ఇబ్బందులు పడకుండా త్రాగునీరు, పాలు, అల్పాహారం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారిని సూచించారు. తెలంగాణా, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 800 బస్సులు వచ్చే అవకాశం వుందని ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట ప్రణాళికలతో పార్కింగ్ చేసుకుని తిరిగి వెళ్ళేందుకు సూచిక బోర్డులతో పాటు తగు సూచనలను జారీ చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా సమాచారం నిమిత్తం హెల్ప్ డెస్క్, కంట్రోల్ రూమును ఏర్పాటు చేసి తగు సమాచారాన్ని భక్తులకు తెలపాలన్నారు. శ్రీశైలక్షేత్ర పరిధిలో శానిటేషన్ సిబ్బందితో ఎక్కడ చెత్తా చెదారం, మురికికాల్వలు శుభ్రం తదితర పారిశుద్ధ్య పనులను 24 గంటల పాటు మూడు షిఫ్టులలో పనిచేసేలా చర్యలు తీసుకుకోవాలని డీపిఓ ను ఆదేశించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న చెక్‌పోస్టులలో ఫిబ్రవరి 19 నుండి మార్చి 1వ తేదీ వరకు ఎలాంటి రుసుం తీసుకోకుండా వాహనాలను అనుమతించాలని ఫారెస్ట్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని ప్రాంతాలలో దోమల నియంత్రణకు ఫాగింగ్ మిషన్లు వినియోగించాలని మలేరియా అధికారులను సూచించారు. హోటళ్ళలో విక్రయించే తినుబండరాలను శ్యాంపిల్స్ ను సేకరించి తనిఖీ చేయడంతో పాటు ధరల సూచికల బోర్డులను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజి అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు అమలు చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సమకూర్చాలని ఎపీఎస్పి డీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయముతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. గతంలో జరిగిన చిన్న చిన్న లోటుపాట్లు వుంటే సరిచేసుకోవాలని సూచించారు. ఫారెస్ట్, పోలీసు అధికారులు సహకరించి సాక్షి గణపతి సమీపంలో ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాలలో అన్ని శాఖలు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని అధికారులను సూచించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు శ్రీశైలంలో భక్తులకు చేస్తున్న ఏర్పాట్లపై పిపిటి ద్వారా వివరించారు. అడిషనల్ ఎస్పి యుగంధర్ బాబు మాట్లాడుతూ క్యూ లైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. దాదాపు 3 వేల పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

## కీచక ఉపాధ్యాయుడు పై సస్పెన్షన్ వేటు



**కర్నూలు ప్రతినిధి జనవరి 22(రిపబ్లిక్ న్యూస్):**
కోడుమూరు మండలంలోని నీ వెంకటగిరి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మన్న పై విద్యార్థినిలపై లైంగిక ఆరోపణలు రావడంతో ఎంఈఓ ద్వారా విచారణ జరిపి లక్ష్మన్నను సిసిఏ రూల్స్ ప్రకారం సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ ప్రకటించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మన్న గత కొంతకాలంగా విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎంఈఓ విచారణ జరపగా, వాస్తవమని తేలగా కోడుమూరు పోలీసు స్టేషన్ లో ఉపాధ్యాయుడు పై ఫోక్సో కేసు నమోదు కు నమోదయింది.ం

### వాలంటరీ టీచర్లకు వయోజన విద్యపై

## పూర్తి అవగాహన కల్పిస్తున్న జిల్లా విద్యాశాఖ సూపర్వైజర్ ఫయాజ్

**అక్షరాస్యత ప్రమోషన్,.బాల్య వివాహాల నిర్మూలన .**

**డిజిటల్ అక్షరాస్యత ప్రోత్సహణ .పరిశుభ్రతపై చైతన్యం**






**దేవనకొండ, జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్) :**కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలో గల శ్రీ శక్తి భవనంలోఉల్లాస్ కార్యక్రమం కింద రెండవ విడత మూడవ రోజు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.వారు ఏ విధంగా చదువు చెప్పాలి ఈ మూడు నెలల కాలంలో వాళ్లని అక్షరాస్యులుగా ఎలా చేయాలని , %ఘ్రావీ % నరసన్న మరియు కర్నూలు జిల్లా నుండి వచ్చిన వయోజన విద్య సూపర్వైజర్ ఫయాజ్ సార్ వాళ్ళు తెలియజేయడం జరిగింది. వారికి వయోజనులకు సంబంధించి బుక్స్, వారి అటెండెన్స్, వాలంటరీ టీచర్ కు సంబంధించి న మార్గదర్శిని బుక్స్ ను పంపిణీ చేయడం జరిగింది. రేపట్నుంచి వీరు వీరికి సంబంధించిన పదిమందికి విద్య నేర్పించాలి అని ఇక్కడికి వచ్చిన వాలంటరీ టీచర్లకు తెలియజేయడం జరిగింది. వాలంటరీ టీచర్లు అందరితో పరిశుభ్రత పాటించాలని, అక్షరాసులుగా చేయాలని, బాల్య వివాహాలను నిర్మించాలని, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించాలని అందరితో ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగింది. ఇందులో వెలుగు డిపార్ట్మెంట్ కి సంబంధించిన సీసీలు , అకౌంటెంట్ ,విఓఏ లు, వివిధ గ్రామాల వాలంటరీ టీచర్లు పాల్గొనడం జరిగింది

# జిల్లాలో పోలీసుల కృషి, పనితీరు అభినందనీయం.










**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమల రావు ఐపియస్**

**- ప్రజలకు మేరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పని చేయాలి.**

**- విజబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలి.**

**-సైబర్ నేరాలను కట్టడి చేయాలి.**

**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)** గౌరవ ముఖ్యమంతి ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ ఉండాలని, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను అరికట్టాలని కర్నూలు జిల్లా పోలీసు యంత్రాంగానికి సూచించడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి శ్రీ ద్వారక తిరుమల రావు ఐపియస్ తెలిపారు.ఈ సంధర్భంగా బుధవారం ఉదయం గౌరవ డిజిపి శ్రీ ద్వారకా తిరుమలరావు గారు కర్నూలు జిల్లాకు విచ్చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియం దగ్గర పోలీసుల నుండి గౌరవందనం స్వీకరించారు. అనంతరం వ్యాస్ ఆడిటోరియం ఎదుట మొక్కలను నాటారు.పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు.సైబర్ నేరాలను కట్టడి చేయాలన్నారు. చిన్న పిల్లలు, మహిళల పై జరిగే లైంగిక నేరాలను అరికట్టాలన్నారు. పోలీసు బృందాలు ఏర్పాటు చేసి నేరాలను చేధించాలన్నారు.

విస్తృతంగా టెక్నాలజీ వినియోగించాలన్నారు. సిఐలకు డిఎస్పీలుగా త్వరలో పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు. అనంతరం డిజిపి గారిని కర్నూలు రేంజ్ డిఐజి గారు, కర్నూలు జిల్లా ఎస్పీ గారు శాలువతో సన్మానించి, నటరాజ విగ్రహ జ్ఞాపికను అందజేశారు.అనంతరం గౌరవ డిజిపి గారు మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఎఎస్పీ ట్రైనీగా కర్నూలు జిల్లాలో పని చేశానన్నారు. ఎఎస్పీ ట్రైనీగా పని చేసిన విషయాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. నేరాలు అరికట్టడం , శాంతిభద్రతల పరిరక్షణ విషయాల గురించి జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష చేయడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లా పోలీసుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు.

కర్నూలు ఎస్పీ పని చేస్తున్న జి. బిందు మాధవ్ ఐపియస్ కాకినాడ కు బదిలీకావడం జరిగిందన్నారు . ఆయనతో కూడా మాట్లడం జరిగిందన్నారు. కొత్తగా జరుగుతున్న నేరాల పట్ల, క్రైమ్ రివ్యూ విషయంలో టెక్నాలజీ వాడుకోవాలనే విషయాలను కేసులు త్వరితగతిన పురోగతి సాధించాలని జిల్లా పోలీసు అధికారులకు తెలిపారుమ్యాన్ ఫవర్ తగ్గించి , సాంకేతికత పరిజ్ఞానం వినియోగిస్తూ కేసులు చేధించాలన్నారు. ప్రజలకు మేరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగం పని చేయాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్ ఐపియస్ గారు, కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ , హెూంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం. మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, హేమలత, భాస్కర్ రావు, ట్రైనీ డిఎస్పీ ఉష శ్రీ, సిఐలు , ఆర్ ఐలు పాల్గొన్నారు.

# చికెన్ తినేవారికి బిగ్ షాక్

# కోళ్లకు అంతుచిక్కని వైరస్, లక్షల్లో మృతి

**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)** ఏపీ కోళ్లను మృత్యువాత పడేలా చేస్తున్న అంతుచిక్కని వైరస్ పశ్చిమగోదావరి జిల్లాను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. సాయంత్రం ఆరోగ్యంగా కనిపించే కోడి, తెల్లవారుజామున చనిపోతున్న దారుణ పరిస్థితులు నెలకొన్నాయి.ఈ వ్యాధి కారణంగా జిల్లాలో ఇప్పటివరకు లక్షకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయని తెలుస్తోంది. ముఖ్యంగా పందేలు కోసం ప్రత్యేకంగా పెంచిన కోళ్లు కూడా వైరస్ బారిన పడి మరణించాయి, దీంతో కోళ్ల పెంపకందారులు భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారు.ఇదే వైరస్ నాలుగేళ్ల క్రితం కూడా పశ్చిమగోదావరిలో కోళ్లను తీవ్రంగా ప్రభావితం చేసింది. అప్పట్లో కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోవడంతో మార్కెట్‌లో అమ్మకాలు పూర్తిగా పతనమయ్యాయి. వైరస్ తగ్గుముఖం పట్టడానికి చాలా రోజులు పట్టింది. ఇప్పుడు మరోసారి ఇదే వైరస్ తిరిగి ప్రబలుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వైరస్ సోకిన కోడికి ప్రత్యేకమైన లక్షణాలు కనిపించవు. ఉదయం ఆరోగ్యంగా ఉన్న కోడి, మధ్యాహ్నానికి లేదా సాయంత్రానికి చనిపోతుంది. వైద్యుల ప్రకారం.. ఈ వైరస్ కోడి



గుండెపై నేరుగా ప్రభావం చూపిస్తుంది.గుండె చుట్టూ నీరు చేరి గుండెపోటుతో కోడి మరణిస్తుంది. వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నప్పటికీ, వైరస్ సోకిన కోళ్లకు అది పని చేయడం లేదు.వైరస్ సోకిన కోడి వల్ల సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర కోళ్లకు కూడా వైరస్ సోకే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కోళ్ల మధ్య వేగంగా వ్యాపించే ఈ వైరస్ కారణంగా కొన్ని గంటల్లోనే పెంపక కేంద్రాల్లోని అన్ని కోళ్లు చనిపోతున్నాయి.మృత్యువాత చెందిన కోళ్లను రహదారుల పక్కన సంచుల్లో వేయడం వల్ల వైరస్ మరింత వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.కోళ్ల కళేబరాలను 3 అడుగుల లోతైన గోతిలో పూడ్చి, సున్నం వేసి నశింపజేయాలని, లేదా కాల్చేయాలని సూచిస్తున్నారు. ఈ విధంగా చేస్తే వైరస్ వ్యాప్తి నుంచి మిగిలిన కోళ్లను రక్షించవచ్చు.వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో కోళ్ల మాంసం తినడం ప్రమాదకరమని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు మాస్కులు, గ్లవ్స్ వంటివి ఉపయోగించి జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ వైరస్ కారణంగా మార్కెట్‌లో కోళ్ల ధరలు పడిపోవడం, అమ్మకాలు తగ్గడం వంటి పరిణామాలు ఏర్పడే అవకాశముందని పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవైరస్ ప్రభావాన్ని తగ్గించేందుకు కోళ్లను గుంపులుగా ఉంచకుండా, శుభ్రత పాటిస్తూ, ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటించాలని వ్యాపారులు, పెంపకందారులకు వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిలిచిపోయిన క్లస్టర్ యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి: ఎస్ఎఫ్ఐ

**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)**

కర్నూల్ సమీపంలో జగనాథ్ గట్టు పైన నిర్మిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ నీ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బృందం భవనాల దగ్గరికి వెళ్లి సందర్శించి నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. క్లస్టర్ యూనివర్సిటీ నిర్మాణాలలో జరిగిన అవినీతిపై విచారణ చేయించాలి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా మాట్లాడుతూ2023-2024 విద్యా సంవత్సరానికి కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ బడ్జెట్రూ. 5,320. కొత్త కాంప్లెక్స్ నిర్మాణానికి బడ్జెట్ కేటాయించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీకి సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలను ప్రధాన కళాశాలగా గుర్తించింది.కళాశాల శ్రేష్ఠత మరియు దాని NAAC-A గ్రేడ్‌కు ఉన్నందున ఎంపిక చేయబడింది.దక్షిణ భారతదేశంలోని కర్నూల్ జిల్లా కేంద్రంలో సిల్వర్ జూబ్లీ, కె వి ఆర్, ప్రభుత్వ పురుషుల కాలేజీలతో ఏర్పాటు చేసిన క్లస్టర్ యూనివర్సిటీ 2018 మే 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యా మౌలిక సదుపాయాల సంస్థ కాంట్రాక్టర్ కు అప్పగించింది. ఇందులో భాగంగానే సిల్వర్ జూబ్లీ 29.3 కోట్లు కె.వి.ఆర్ 11,22 ఫర్ మెన్ 14.04 కళాశాలలో రాష్ట్రీయ




ఉచిత శిక్ష అభియాన్ పథకం (రూస) నిధులతో ఆయా కళాశాలలో అకాడమిక్ భవన్, లైబ్రరీ, హాస్టల్, త్రాగునీరు ఇతర అవసరాలకోసం ఖర్చు చేసిన ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి కారణం వాటికి పెయింటింగ్, ఎలక్ట్రికల్ పైప్ లైన్ కనెక్షన్లు నిలిపివేయటం.గత ప్రభుత్వం 2019 నాటికి క్లస్టర్ యూనివర్సిటీ పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తాం అని చెప్పి అప్పుడు కరోనా వైరస్ కారణం చెబుతూ నాటి నుండి నేటి వరకు పూర్తి చేయలేకపోయింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా ఈ విషయంపై పలుమార్లు ఉపకులపతి సాయి గోపాల్ ప్రశ్నించగా పనులు పూర్తి కావస్తుంది అని చెప్పటం తప్ప చేసింది ఏమి లేదు మరోవైపు జగన్నాథ్ గట్టుపై అసంపూర్తిగా ఉన్న భవనాలు దర్శనమిస్తున్నాయి అవి ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి ఎస్ఎఫ్ఐ బృందం జగన్నాథ్ గట్టుపై నిర్మిస్తూ హాస్టల్ భవనాలు అకాడమిక్ బ్లాక్ లను సందర్శించినప్పుడు ఈ నిర్మాణం మధ్యలో ఆగిపోవడానికి కారణం నిధులలో సక్రమంగా కాంట్రాక్టర్ చెల్లించలేకపోవటం వల్ల అని తెలిసింది. ఇదే విషయంపై ఆరా తీస్తే నాకు ఇవ్వాల్సిన మొత్తం నిధులు చెల్లిస్తే నేను భవనాలు అప్పగిస్తాను అంటూ కాంట్రాక్టర్ చెబుతున్నారు అని తెలిసింది. మరో వైపు గత ప్రభుత్వ ఆర్థికశాఖ మంత్రి వీసీ రిజిస్టర్ కు తెలియకుండా దాదాపు 40 కోట్ల రూపాయల వరకు విత్ డ్రా చేసినట్లు ఆరోపిస్తూ డోన్ ఎమ్మెల్యే విద్యాశాఖ మంత్రి తీసుకెళ్లినట్టు సామాజిక మాధ్యమాలలో చెక్కలు కొడుతున్నాయి. ఏది ఏమైనా ఈ రాజకీయ క్రీడలో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ గా భావిస్తున్నాము తక్షణమే ఈ నిర్మాణం పైన విచారణ కమిటీ వేయించి కాంట్రాక్ట్ రావాల్సిన డబ్బులు త్వరగా చెల్లించి రాబోయే విద్యా సంవత్సరంలోపైన ఈ భవనాలు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పి ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి పిఎస్ఎన్ జిల్లా కన్వీనర్ అమర్ ఎస్ఎఫ్ఐ నగర నాయకులు మల్లేష్ పిఎస్ఎన్ నాయకులు మనోహర్ శంకర్ చింటూ తరుణ్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేద పాఠశాల విద్యార్థుల మృతి పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎం.పి బస్తిపాటి నాగరాజు

## ఘటన పై మఠం పీఠాధిపతితో వివరాలు అడిగి తెలుసుకున్న ఎం.పి



కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్) కర్ణాటక రాష్ట్రం సిందనూరు వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వేద పాఠశాలకు చెందిన విద్యార్థులు మృతి చెందడం పై ఎం.పి బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజాపంపిణీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధ్యయన పర్యటన లో భాగంగా ముంబైలో ఉన్న ఎం.పి, రోడ్డు ప్రమాదం పై మంత్రాలయం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులతో ఫోన్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ హంపిలో జరిగే నరహరితీర్థుల ఆరాధానోత్సవాలకు వెళ్తూ సిందనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వేద పాఠశాల విద్యార్థులు అభిలాష, హైవదన, సుజయింద్ర తో పాటు డ్రైవర్ శివ మృతి చెందండం బాధాకరమన్నారు.. దైవ కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు.. ఇక మృతుల కు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తునానన్న ఎం.పి, మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తో పాటు తాను అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని ఎం.పి నాగరాజు తెలిపారు..ం

# ముంబైలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులతో సమావేశమైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ.సమావేశంలో ఎం.పి బస్తిపాటి నాగరాజు



**కర్నూలు ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్)** వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ పై మహారాష్ట్ర రాష్ట్ర రాజధాని ముంబైలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రెండవ రోజు అధ్యయన పర్యటన నిర్వహించింది..ఈ పర్యటన లో స్టాండింగ్ కమిటీ సభ్యుడైన కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.. పర్యటనలో భాగంగా కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిధి తో కలిసి సభ్యులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ కార్యాలయాన్ని సందర్శించి బీ.ఐ.ఎస్ గార్డెన్ ను ప్రారంభించారు.. అనంతరం అక్కడి అధికారులతో సమావేశమై వస్తువుల ప్రామాణీకరణ, మార్కింగ్ మరియు నాణ్యత ధృవీకరణ కార్యకలాపాల పై చర్చించారు..

# ఉద్యానవనాల నిర్వహణ మరింత మెరుగుపడాలి





**కర్నూలు, ప్రతినిధి జనవరి 22 (రిపబ్లిక్ న్యూస్):**నగరంలో ఉద్యానవనాల నిర్వహణ మరింత మెరుగుపరచాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నేతాజీ నగర్‌లోని ఉద్యానవనాన్ని, రాంబోట్ల దేవాలయం వద్ద బంట్ రహదారిని, అలాగే వీకర్ సెక్షన్ కాలనీలోని నూతనంగా నిర్మించిన మురుగు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఆయా కాలనీ వాసులు ఉద్యానవనాలకు వస్తుంటారని, అధికారులు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పిచ్చిమొక్కల తొలగింపు, చిన్నపాటి మరమ్మత్తులు, నిర్మాణాలు, పచ్చదనం పెంపునకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రాజ్ విహార్, వినాయక ఘాట్, ఐదు రహదారుల కూడలి ప్రాంతాల్లో కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిఈఈలు క్రిష్ణలత, గిరిరాజు, ఏఈ భాను ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# దళితులను హత్య చేసిన కేసులో ముద్దాయిగా ఉన్న వ్యక్తిని బిజెపి అధ్యక్షుడిగా పెట్టడమేమిటి?

## కెవిపియస్ విమర్శ




**కర్నూలు ప్రతినిధి జనవరి22 (రిపబ్లిక్ న్యూస్)** కౌతాళం మండలం కామవరం గ్రామంలో 2022 జనవరి 27న దళితులపై పట్టపగలు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ముద్దాయిగా ఉన్న రామకృష్ణను బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం బిజెపి పార్టీ యొక్క నైతికతకు నిదర్శనమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు విమర్శించారు. బుధవారం కర్నూల్ నగరంలోని బుధవార్ పేటలో ఉన్న కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎం రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ జి కృష్ణ తో కలిసి ఆనంద్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులపై జరిగిన కిరాతకమైన హత్య ఘటనలో ముద్దాయిగా ఉన్న వ్యక్తి తప్ప బిజెపికి వేరే నాయకులు జిల్లా అధ్యక్షులుగా పెట్టడానికి దొరకలేదా ఎద్దేవా చేశారు. హత్య ఘటనలే కాదు, అనేక అసాంఘిక కార్యక్రమాలు మట్కా లాంటి వాటితో కూడా సంబంధం ఉంది అని ప్రచారం జరుగుతున్న వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించారు అని అంటేనే, మతసామరస్యానికి, కుల మత సోదర భావానికి ప్రతీకగా ఉన్న కర్నూలు జిల్లాను ఏమి చేయాలనుకుంటున్నారని వారు ప్రశ్నించారు. ఇప్పటికే ఒకవైపు పార్లమెంటు సాక్షిగా దేశానికి హెూం మంత్రిగా ఉన్న అమిత్ షా అంబేద్కర్ అంబేద్కర్ అంటూ అంబేద్కర్ను అవమానించి, దేశంలో ఉన్న నిమ్న కులాలు అందరికీ హక్కులను ప్రసాదించిన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్న క్రమంలో కర్నూలు జిల్లాలో కూడా దళితులపై జరిగిన హత్యాకాండలో భాగం పంచుకున్న రామకృష్ణను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం, బిజెపి యొక్క కుటిల నీతి అర్థమవుతోందన్నారు. వెంటనే రామకృష్ణను బిజెపి అధ్యక్షుడిగా తొలగించి మరో వ్యక్తిని బీసీ సామాజిక తరగతి నుండే జిల్లా అధ్యక్షులుగా నియమించాలన్నారు. ఇప్పటికైనా బిజెపి మాయలో ఉండే దళితులు, బడుగు బలహీన వర్గాలు గమనించి ప్రశ్నించాలని కోరారు.

# వీరధీరసూరన్‌లో విక్రమ్ బిజీబిజీ




కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ స్టార్ హీరో నటిస్తున్న చిత్రాల్లో ఒకటి వీరధీరసూరన్. ఛియాన్ 62 ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ మూవీకి చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎక్జయిటింగ్ అప్‌డేట్ అందించబోతున్నారంటూ యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ రియా ఓ సెల్ఫీ వీడియో షేర్ చేసింది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుదల తేదీయే అయి ఉంటుందని అంతా చర్చించుకుంటుండగా.. దీనిపై మరికొన్ని గంటల్లోనే క్లారిటీ రానుంది. క్యూట్ క్యూట్‌గా సాగుతున్న రియా సెల్ఫీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన వీరధీరసూరన్ టైటిల్ టీజర్ పక్కా యాక్షన్ ప్యాక్‌డ్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలియజేస్తుంది. ఈ చిత్రాన్ని ఏపీలో శ్రీలక్ష్మి మూవీస్, తెలంగాణలో ఎన్‌వీఆర్ బ్యానర్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మూవీలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# ఓటీటీ వల్లనే సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి : అక్షయ్‌కుమార్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థియేటర్‌లో వచ్చే సినిమాలు ఓటీటీ (ఓవర్ ది టాప్)ల వలనే ఫ్లాప్ అవుతున్నాయని తెలిపాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమాతో వీర్ పహరియా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుండగా.. సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా ఈ సినిమా రూపొందగా.. ఇందులో సారా అలీ ఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషించారు. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ బ్యానర్లపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ఇండియన్ సినిమా ప్రస్తుతం ఎందుకు ఇంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది?.. ఎందుకు సక్సెస్ రేట్ ఎందుకు ఇంత తక్కువగా ఉందని మీడియా అక్షయ్‌ని ప్రశ్నించగా.. అక్షయ్ సమాధానమిస్తూ.. ఓటీటీల వలనే సినిమాలు థియేటర్‌లో ఆడకుండా ఫ్లాప్ అవుతున్నాయని వెల్లడించాడు. నేను ఈ మధ్య కొంతమందిని కలిసినప్పుడు వారితో సినిమాల గురించి మాట్లాడాను. అయితే వారు సినిమాలు థియేటర్‌లో కాకుండా ఓటీటీలో చూస్తున్నాం అని చెబుతున్నారు. ఒక సినిమా బాక్సాఫీస్ దగ్గర రన్ అవ్వకుండా ఫ్లాప్ అవ్వడానికి ఇదే ముఖ్య కారణం. కరోనా వేవ్ తర్వాత కూడా ఓటీటీలకు అలవాటైన ప్రేక్షకులు ఇప్పుడు థియేటర్‌కి రావడం క్రమంగా తగ్గించారు. ఈ మధ్య ఈ అలవాటు బాగా పెరిగింది అని తెలిపాడు. ప్రేక్షకులు కూడా ఈ మధ్య సెలక్టివ్‌గా సినిమాలు చూస్తున్నారు. వారికి సినిమా నచ్చితేనే థియేటర్‌కి వెళుతున్నారు. లేకుంటే అదే సినిమాను ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేసి చూస్తున్నారు అంటూ అక్షయ్ చెప్పుకొచ్చాడు.

# ఆటోడ్రైవర్‌ను కలిసిన సైఫ్



ముంబైలో ఈ నెల 16న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై తన ఇంట్లో ఓ దుండగడు కత్తితో దాడి చేశాడని తెలిసిందే. తెల్లవారుజామున 2 గంటలకు ఇంట్లో దాడి జరగ్గా.. అతన్ని 3.30 నిమిషాలకు లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటన జరిగిన సమయంలో తనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడిన ఆటోడ్రైవర్ భజన్ సింగ్ రానాను సైఫ్ అలీ ఖాన్ కలిశాడు. దాడి జరిగిన సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లి తనను కాపాడిన భజన్ సింగ్ రానాకు కృతజ్ఞతలు తెలియజేశాడు సైఫ్ అలీఖాన్. భజన్ సింగ్‌తో సైఫ్ అలీఖాన్ దిగిన ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. దాడి జరిగిన సమయంలో సైఫ్ అలీ ఖాన్ రక్తంతో తడిసిపోయాడని, నడవలేని స్థితిలో ఉన్నాడని ఆటో డ్రైవర్ భజన్ సింగ్ ఇప్పటికే మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. సైఫ్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో హీరోను పొడిచాడు. సుమారు ఆరు చోట్ల బలమైన కత్తిపోట్లు ఉన్నట్లు లీలావతి ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. రెండు చోట్ల మాత్రం ఆ కత్తి పోట్లు చాలా డీప్‌గా ఉన్నాయని.. ఒక కత్తిపోటు సైఫ్ వెన్నుపూస సమీపంలో డీప్‌గా దిగినట్లు చెప్పారు. మెడ, చేయి, వెన్నులో ఓ పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు తెలిపారు. వెన్నులో దిగిన వస్తువును సర్జరీ ద్వారా తొలగించినట్లు వెల్లడించారు.

# సినిమా రంగం నాకు ఇష్టం లేదు : నిత్యా మేనన్



మలయాళ భామ నిత్యా మేనన్ కు దక్షిణాదిలోనే కాదు... బాలీవుడ్ లో కూడా మంచి గుర్తింపు ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నిత్య మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు సినిమా రంగం అంటేనే ఇష్టం లేదని ఆమె చెప్పారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా జీవితాన్ని అనుభవించాలనేది తన కోరిక అని... ఏదైనా అవకాశం వస్తే మరో రంగంలోకి వెళ్లాలని కూడా ప్రయత్నించానని తెలిపారు. అయితే జాతీయ అవార్డు తన ఆలోచనలను మార్చిందని చెప్పారు. ఉత్తమ నటిగా తాను అందుకున్న పురస్కారం తన సినీ జీవితానికి ఒక మార్గాన్ని చూపించిందని అన్నారు. మరోవైపు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ లో నిత్యా మేనన్ నటించాల్సి ఉంది. నిత్య కథానాయికగా జయలలిత బయోపిక్ చేస్తున్నట్టు 2019లో ప్రియదర్శిని అనే యువ దర్శకురాలు ప్రకటించారు. 'ది ఐరన్ లేడీ' అనే టైటిల్ పోస్టర్ ను కూడా విడుదల చేశారు. ఇది జరిగి ఐదేళ్లు దాటుతున్నా సినిమా మాత్రం పట్టాల పైకి ఎక్కలేదు. జయ బయోపిక్ పై నిత్య మాట్లాడుతూ... బయోపిక్ చేయాలని తాము ఎంతో ఆశపడ్డామని చెప్పారు. అయితే తాము సినిమాను ప్రకటించిన తర్వాత అదే కథతో 'తలైవి' అనే మూవీ వచ్చిందని తెలిపారు. కొంత కాలానికి 'క్వీన్' పేరుతో వెబ్ సిరీస్ వచ్చిందని చెప్పారు. ఈ రెండు విడుదలయ్యాక... తాము సినిమా చేస్తే రిపీట్ చేసినట్టు అవుతుందని... అందుకే ఆ సినిమాను పక్కన పెట్టేశామని తెలిపారు.

# వీల్‌చైర్‌పై రష్మిక

## త్వరగా కోలుకోవాలని అభిమానుల పోస్టులు



నేషనల్ క్రష్ రష్మిక మందన్నకి ఇటీవలే ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రెండు వారాల క్రితం జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తుండగా.. కాలికి గాయం అయింది. అప్పటి నుంచి రష్మిక ఇంట్లోనే ఉంటూ రెస్ట్ తీసుకుంటున్నారు. తాజాగా రష్మిక వీల్‌చైర్‌పై దర్శనమిచ్చారు. కాలికి కట్టుతో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన రష్మిక.. కారు దిగగానే వీల్‌చైర్‌లో కూర్చుని వెళ్లారు. ఆ సమయంలో ముఖం కనిపించకుండా మాస్క్ పెట్టుకుని, తలకు క్యాప్‌తో దర్శనమిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వీడియో చూసిన నెటిజన్లు రష్మిక త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు.



# మోనాలిసా.

# కుంభమేళా టు బాలీవుడ్

ఉత్తర ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాలో ప్రతి రోజు ఎన్నో చిత్ర విచిత్రాలు జరుగుతూ ఉంటాయి. అయితే కొన్ని మాత్రమే సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. కుంభమేళా ఆరంభం అయినప్పటి నుంచి ఒక అమ్మాయి గురించి ప్రముఖంగా సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆ అమ్మాయి పేరు మోనాలిసా. ఇండోర్‌కి చెందిన మోనాలిసా ఫ్యామిలీ కుంభమేళాలో పూసల దండలు, రుద్రాక్ష దండలు అమ్ముకోవడానికి వెళ్లారు. కుంభమేళాలో కొందరు యువకులు ఈమెను చూసి చాలా అందంగా ఉంది అంటూ ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆమె కళ్లు చాలా స్పెషల్‌గా ఉన్నాయంటూ ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. కుంభమేళాకు వెళ్లిన వారిలో చాలా మంది ఇప్పుడు మోనాలిసా ఎక్కడ ఉంది అంటూ వెతకడం మొదలు పెట్టారు. ఆమె ఎక్కడ కనిపిస్తే అక్కడ గుంపులుగా ఏర్పడి ఆమెతో సెల్ఫీకి ఎగబడుతున్నారు. ఆమెను కాపాడేందుకు ఒకానొక సమయంలో ఫ్యామిలీ మెంబర్స్‌కి చాలా ఇబ్బందిగా మారింది. సోషల్ మీడియాలో అప్పుడప్పుడు ఇలా వైరల్ కావడం మనం చూస్తూనే ఉంటాం. మోనాలిసా సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే ఎవరో ఒకరు కచ్చితంగా పిలిచి సినిమా ఆఫర్లు ఇస్తారని అంతా భావించారు. అనుకున్నట్లుగానే బాలీవుడ్ నుంచి మోనాలిసాకి సినిమా ఆఫర్ వచ్చింది. అయితే సినిమా ఆఫర్ పై మోనాలిసా స్పందన ఏంటి అనేది చూడాలి. ! బాలీవుడ్ దర్శకుడు సనోజ్ మిశ్రా తన సినిమాలో కుంభమేళా మోనాలిసాకి ఛాన్స్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు చెప్పుకొచ్చాడు. త్వరలోనే మోనాలిసాను కలుస్తాను అన్నాడు. అయితే ఆయన తీయబోతున్న సినిమా ఏంటి, ఆమెను ఏ పాత్ర కోసం ఎంపిక చేయబోతున్నది క్లారిటీ ఇవ్వలేదు. నటిగా చేసే ఉద్దేశ్యం మోనాలిసాకు ఉందా అంటూ కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ వంటి అతి పెద్ద ఇండస్ట్రీలో నటించే అవకాశాల కోసం లక్షల మంది వెయిట్ చేస్తూ ఉంటారు. అలాంటి అవకాశం వస్తే మోనాలిసా వదులుకోదు అని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మోనాలిసా మేకోవర్ మార్చేసింది. ఇటీవల ఒక బ్యూటీషన్ సోషల్ మీడియాలో మోనాలిసా వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో మోనాలిసాకి మేకోవర్ చేసింది. ఆ వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మోనాలిసా ఈమధ్య సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది కానీ, ఆమె ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఛానల్, ఎక్స్ ఖాతాలు చాలా కాలంగా ఉన్నాయి. ఆమె వీడియోలను షేర్ చేస్తూ ఉండేది. కానీ ఆ వీడియోలు పెద్దగా వైరల్ కాలేదు. కానీ అనూహ్యంగా ఇప్పుడు మోనాలిసాకి మంచి గుర్తింపు దక్కింది. మోనాలిసా కళ్లలో ఉన్న ప్రత్యేకత కారణంగా కచ్చితంగా బాలీవుడ్‌లో మంచి ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నటిగా తనను తాను నిరూపించుకుంటే కచ్చితంగా సినిమా ఇండస్ట్రీలో ఈమెకు మంచి ఫ్యూచర్ ఉంటుంది. అయితే సినిమాల ఎంపిక విషయంలో కాస్త జాగ్రత్తలు









# జిల్లా పోలీసు అధికారులతో రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు సమీక్ష

- నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుల పనితీరును అభినందించిన డిజిపి
-మున్ముందు మరింత స్ఫూర్తితో పనిచేయండి
-జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిని డీజీపీకి వివరించిన ఎస్పీ





**నంద్యాల క్రైం, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర డీజీపీ శ్రీ ద్వారకా తిరుమలరావు జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో నేరాల పరిస్థితిపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా డీజీపీ ద్వారకా తిరుమలరావు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయానికి రాగానే కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం జిల్లా సాయుధ బలగాలనుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సమీక్షా సమావేశంలో ముందుగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యల గురించి డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వివిధ రకాల నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని,నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు వారి సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రస్తుతం నేరాలు అదుపులో ఉన్నాయన్నారు.ముఖ్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైబర్ నేరాలు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.నిబద్ధతగా పనిచేసి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు టెక్నాలజీని ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో డ్రోన్స్, సీసీ కెమెరాలు వాడుతున్నామన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరస్తులను కనుగొనడం జరుగుతుందని, జిల్లాలో ఫింగర్ ప్రింట్ యూనిట్ బలోపేతం చేయడం ద్వారా వివిధ రకాల కేసులలో నేరస్తులను కనుగొని కేసులను ఛేదించడం జరిగిందని తెలియజేశారు. క్రైమ్ డిటెక్షన్ లో సిసి ఫుటేజ్ ఆధారాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని, వీటి కోసం రాష్ట్రంలో 18 వేల సిసి కేమరాలను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా లక్ష కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల ఎస్.డి.పి.ఓ. మంద జావళి ఆల్ఫోన్స్, డీఎస్పీలు రవికుమార్,శ్రీనివాస్ జిల్లా ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## గర్భవతులను వంద శాతం నమోదుచేసి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలి

**టీనేజ్ ప్రెగ్నెన్సీ లపై విశ్లేషణ చేయాలి - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**కర్నూలు, ప్రతినిధి జనవరి 22( రిపబ్లిక్ న్యూస్) :** గర్భవతులను వంద శాతం నమోదుచేసి వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు..బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భవతులు 38018 మందిని గుర్తించగా అందులో 3 నెలల లోపు ఉన్న గర్భవతులకు 34198 మందిని మాత్రమే రిజిస్టర్ చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలు గర్భం దాల్చిన 3 నెలల లోపే ఎందుకు చేయలేకపోతున్నారని డీఎంఎచ్వో ను ప్రశ్నించారు..తగినంత మంది ఆశా వర్కర్లు,ఏఎన్ఎం లు ఉన్నారు, గ్రామానికి కేవలం ఇద్దరూ లేదా ముగ్గురు గర్భవతులు ఉంటారని వారిని కూడా రిజిస్టర్ చేయకపోతే ఎలా అని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు... ఆలస్యంగా నమోదు చేయడం వల్ల ఆరోగ్య పరిస్థితిలో ఇబ్బందులు ఉంటే గుర్తించే అవకాశం ఉండదన్నారు..మండల వారీగా సమావేశాలు నిర్వహించుకుని 3 నెలల లోపు నమోదు చేయని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డీఎంఎచ్వో ను ఆదేశించారు.. ఎక్కడైతే తక్కువ శాతం నమోదు ఉందో సదరు మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించుకోవాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ ను ఆదేశించారు.గర్భవతుల ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..



అభా ఐడిలు జెనరేషన్ కు సంబంధించి 68 శాతం మాత్రమే జెనరేట్ చేశారని, ఇంకా 7 వేల మందికి కార్డులు జనరేట్ చేయాల్సి ఉందని, కార్డుల జనరేషన్ వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు డ్రైవ్ మోడ్ లో చేస్తే వెంటనే పూర్తి చేయవచ్చని కలెక్టర్ ఆదేశించారు.. ఈ అంశంపై పర్యవేక్షించాలని డీఎంఎచ్వో ను ఆదేశించారు..
టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా నమోదవుతున్నాయని, ఎందుకు జరుగుతున్నాయో కారణాలను విశ్లేషించాలని, ఇందుకోసం డివిజన్ స్థాయిలో ఆర్డీవో ఆధ్వర్యంలో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఎంహెచ్వోను ఆదేశించారు.. ఈ కమిటీ లో డిఐఒ, డిప్యూటీ డి ఏం హెచ్ ఓ, ఐసిడిఎస్, పోలీసు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.. బాల్య వివాహాల వల్ల టీనేజ్ ప్రెగ్నెన్సీ లు వచ్చే అవకాశం ఉంటుందని, బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ లకు సంబంధించి ఎక్కువ శాతం కర్ణాటక సరిహద్దు గ్రామాల్లోనే నమోదు అవుతున్నాయని, భార్య ఏ రాష్ట్రం నుండి, భర్త ఏ రాష్ట్రం నుండి, పెళ్లి ఎక్కడ జరిగింది, డేట్ ఆఫ్ బర్త్ తదితర వివరాలన్నింటిని సేకరించి నివేదిక తయారు చేయాలని కలెక్టర్ ఐసిడిఎస్, వైద్యాధికారులను ఆదేశించారు..నవజాత శిశువులను రిజిస్టర్ చేయడంలో ఆదోని డివిజన్లో హనుమాన్ నగర్ పీహెచ్సీలో 81 శాతం, పత్తికొండ డివిజన్లో పగిడ్రాయి పీహెచ్సీలో 77% మాత్రమే రిజిస్టర్ చేయడం ఏమిటని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు... వెంటనే మెడికల్ ఆఫీసర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని నవజాత శిశువులను రిజిస్టర్ చేయడంలో పురోగతి సాధించాలన్నారు.. వచ్చే రెండు వారాల్లో పురోగతి చూపకపోతే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్ తెలిపారు.. 80 శాతం కంటే తక్కువ చేసిన పి హెచ్ సి ల మీద తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపి కౌంటర్ల వద్ద ఎక్కువమంది జనాభా ఉండకుండా వైద్య విభాగాల వారీగా టోకెన్ లను ఇచ్చే విధంగా కౌంటర్లను కలెక్టర్ జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు..సమావేశంలో డిఎంహెచ్ఓ డా.శాంతికళ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీకృష్ణ ప్రకాష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, అదనపు డిఎంహెచ్ఓ డా.భాస్కర్, డిసిహెచ్ఎస్ మాధవి, మలేరియా అధికారి నూకరాజు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారులకు అధికారాల పంపిణీ, పని విభజన పై అధ్యయనం

**అధ్యయనం చేసేందుకు గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్ లతో సబ్ కమిటీ ఏర్పాటు: సిసిఎల్ఏ జయలక్ష్మి**

కర్నూలు ప్రతినిధి, జనవరి, 22( రిపబ్లిక్ న్యూస్) : జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దార్లకు అధికారాల పంపిణీ, పని విభజనను, బాధ్యతలను రివైజ్ చేయాల్సి ఉందని, ఈ అంశాన్ని అధ్యయనం చేసేందుకు గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్ లతో సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని సిసిఎల్ఏ జయలక్ష్మి పేర్కొన్నారు..విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లతో సిసిఎల్ఏ ఈ అంశంపై గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సిసిఎల్ఏ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జేసీ, డీఆర్ఓ, సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్ల స్థాయిలో అధికారాల పంపిణీ, పని విభజన, బాధ్యతలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సబ్ కమిటీ లో ఉన్న గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల కలెక్టర్ లను ఆదేశించారు.. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఇంచార్జి డిఆర్ఓ బికె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.






## దావోస్‌లో ఒకే వేదికపై ముగ్గురు సిఎంలు

**చంద్రబాబు, రేవంత్, ఫడ్ణవీస్‌ల కలయిక**




దావోస్,జనవరి, 22( రిపబ్లిక్ న్యూస్) : దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ, ఏఐ, రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ లో మూడో రోజు పర్యటిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో బుధవారం వివిధ రంగాల పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. అలాగే యునీలీవర్, డీపీ వరల్డ్ గ్రూపు, పెట్రోలియం నేషనల్ బెర్హాద్ (పెట్రోనాస్), గూగుల్ క్లౌడ్, పెప్సీకో, ఆస్ట్రా జెనెకా సంస్థల అధిపతులు, బిల్ గేట్స్, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధితోనూ సీఎం చంద్రబాబు చర్చలు జరపనున్నారు. తర్వాత దావోస్ సమావేశాల్లో గ్రీన్‌కోతో ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. ప్రకృతి వ్యవసాయం, హ్యూమన్ మిషన్ కొలాబ్రేషన్, గ్రీన్ హైడ్రోజన్ ? పునరుత్పాదక విద్యుత్ వంటి అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలకు చంద్రబాబు హాజరవుతారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు వున్న అవకాశాలను వారికి ముఖ్యమంత్రి వివరించనున్నారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం...

**ప్రయాణికుల మీదకు దూసుకెళ్లిన రైలు...12 మంది మృతి**



జనవరి, 22( రిపబ్లిక్ న్యూస్) : మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జలగావ్ జిల్లాలో పరండా రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టడంతో 12 మంది మృతి చెందారు.
పుష్పక్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో మంటలు చెలరేగాయన్న వదంతులతో ప్రయాణికులు భయాందోళనలకు గురై చైన్ లాగి కిందికి దిగారు. భయంతో పట్టాలు దాటుతున్న ఆ ప్రయాణికులను మరో ట్రాక్ వేగంగా దూసుకొచ్చిన కర్ణాటక ఎక్స్ ప్రెస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో 12 మంది మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే స్పందించి, ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాద తీవ్రతను బట్టి మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com